



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 345 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ మంగళవారం 19 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥
VOLUME : 11 ISSUE :345 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA TUE 19 AUGUST 2025 PRICE : 5/- RS
Simultaneously Published form Kakinada, Visakhapatnam, Ongole Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur

## వైసీపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టండి

### టీడీపీ శ్రేణులకు చంద్రబాబు పిలుపు

- వైసీపీ తప్పుడు ప్రచారాలపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో విమర్శలు
- ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే ప్రతిపక్షం పని అని వ్యాఖ్య
- 'సుపరిపాలనలో తొలి అడుగు' విజయవంతమైందన్న సీఎం
- కోటి 24 లక్షల కుటుంబాలను నేరుగా కలిశామని వెల్లడి
- పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ
- నేతలు, కార్యకర్తలు మరింత బాధ్యతగా, క్రమశిక్షణతో మెలగాలని సూచన




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో వైసీపీ నిత్యం విషం చిమ్ముతూ, తప్పుడు ప్రచారాలతో ప్రజలను గందరగోళపరిచే కుట్ర చేస్తోం దని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శిం చారు. రాజధాని మునిగిపోయిందని, ప్రాజెక్టులు కొట్టుకుపోతున్నాయని అసత్యాలు ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడమే వారి సిద్ధాంతమని ఆరోపించారు. సోమవారం నాడు పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వైసీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని, ఈ విషయంలో మంత్రులు, పార్టీ నేతలు మరింత చొరవ చూపాలని ఆయన దిశానిర్దేశం చేశారు."రాష్ట్రంలో ఒక నేర చరిత్ర కలిగిన పార్టీ ఉంది. వాళ్ల పని నిత్యం విషం చిమ్మడం, తప్పుడు ప్రచారం చేయడమే వారి పని. సోషల్ మీడియా, సొంత టీవీ, పత్రికల్లో, అనుబంధ మీడియాతో అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. రాజధాని కోసం పొన్నూరును ముంచారని ఒకసారి, కొండవీటి వాగు ఎత్తిపోతల పంపులు పని చేయడంలేదని మరోసారి... ప్రకాశం బ్యారేజ్ ప్రమాదంలో పడిందని ఇంకోసారి వార్తలు వేశారు. తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళ పరచాలి అనే సిద్ధాంతంతోనే వైసీపీ రోజూ పనిచేస్తోంది. వైసీపీ చేస్తున్న ఏ ప్రచారాన్ని పరిశీలించినా వాళ్ల కుట్ర ఏంటో అర్థం అవుతుంది. తప్పుడు ప్రచారాలను

వివరాలు 2లో..

## రాష్ట్ర అభివృద్ధికి పోర్టులే కీలకం.. చేయూతనివ్వండి

### కేంద్రమంత్రికి వివరించిన మంత్రి లోకేశ్

- కేంద్ర మంత్రి సోనోవాల్ తో మంత్రి నారా లోకేశ్ భేటీ
- ఢిల్లీలో సమావేశం
- ఏపీ పోర్టుల అభివృద్ధికి సహకారంపై విజ్ఞప్తి
- మారిటైమ్, జలరవాణా ప్రాజెక్టులకు చేయూతనివ్వాలని కోరిక
- రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి లక్ష్యంగా ప్రతిపాదనలు



పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలో పోర్టుల ఆధారిత అభివృద్ధికి, సముద్ర వాణిజ్యానికి పెద్దపీ ట వేస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఈ దిశగా కేంద్రం మద్దతును కోరింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం నాడు ఢిల్లీలో కేంద్ర షిప్పింగ్, ఓడరేవులు, జలరవాణా శాఖల మంత్రి సర్బానంద సోనోవాల్ తో సమావేశమయ్యారు. రాష్ట్రంలో కీలకమైన మారిటైమ్ ప్రాజెక్టులకు సహకారం అందించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సముద్ర సంబంధిత మౌలిక సదుపాయాల కల్పనకు చేయూతనివ్వాలని లోకేశ్ కోరారు.

వివరాలు 2లో..

## ఉక్రెయిన్ పై ఆగని రష్యా దాడులు... ఖార్కివ్ పై డ్రోన్ దాడి... పలువురు మృతి



- ఖార్కివ్‌లో నివాస భవనంపై రష్యా డ్రోన్ దాడి
- పసికందుతో సహా ఐదుగురి మృతి, 20 మందికి గాయాలు
- మొన్న కూడా క్షిపణి దాడి.. 8 మందికి గాయాలు

పెన్ పవర్ డెస్క్:రష్యా–ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర విషాదాన్ని మిగు లుస్తోంది. ఒకవైపు శాంతి చర్చలు జరుగుతున్నా, క్షేత్రస్థాయిలో దాడులు ఆగడం లేదు. తాజాగా ఉక్రెయిన్‌లోని ఖార్కివ్ నగరంపై రష్యా జరిపిన డ్రోన్ దాడిలో ఏడాది వయసున్న పసికందుతో సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 2లో..

## జగన్‌కు రాజ్‌నాథ్ సింగ్ ఫోన్... మద్దతిస్తారా?

- ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలని విజ్ఞప్తి
- ఎన్డీఏ అభ్యర్థిగా బరిలో ఉన్న రాధాకృష్ణన్
- బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి నేపథ్యంలో జగన్ నిర్ణయంపై ఉత్కంఠ



పెన్ పవర్ డెస్క్:జాతీయ రాజకీయాల్లో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి, వైసీపీ అధినేత జగన్ కు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు ఫోన్ చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ

వివరాలు 2లో..

## సినీ కార్మికుల సమ్మె.. రంగంలోకి చిరంజీవి

- ప్రతి యూనిట్‌తో విడివిడిగా మాట్లాడిన చిరంజీవి
- వేతనాలు పెంచాలని కోరుతూ 15 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులు
- చిరంజీవి తమను పిలిచి మాట్లాడారన్న ఫెడరేషన్ అధ్యక్షుడు



పెన్ పవర్ డెస్క్:సినీ కార్మికుల సమ్మె వ్యవహారంలో మెగాస్టార్ చిరంజీవి జోక్యం చేసుకున్నారు. ఆయన ఫెడరేషన్ సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతి యూనియన్‌తో విడివిడిగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేపు సాయంత్రం సినీ కార్మికుల ఫెడరేషన్‌తో ఫిలిమ్ ఛాంబర్ సమావేశం కానుంది.

**చిరంజీవి మమ్మల్ని పిలిచి మాట్లాడారు**

చిరంజీవితో సమావేశం అనంతరం ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ మీడియాతో మాట్లాడుతూ, కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ తాము 15 రోజులుగా సమ్మె చేస్తున్నామని తెలిపారు. ఈరోజు చిరంజీవి తమను పిలిచి మాట్లాడారని వెల్లడించారు. 24 విభాగాల నుంచి 72 మందితో ఆయన చర్చించారని తెలిపారు. నిర్మాతలు తాము చెప్పేది వినకుండా తమ మీదే నిందలు వేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లామని

వివరాలు 2లో..

## స్టాలిన్‌ను మళ్లీ సీఎం కానివ్వను




- వచ్చే ఎన్నికల్లో డీఎంకేను గెలవనివ్వనన్న శశికళ
- రాష్ట్ర పరిస్థితి చూసి నిద్ర పట్టడం లేదంటూ ఆవేదన
- జయలలిత పాలన వేరు... ఇప్పటి పరిస్థితి వేరు అని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:వచ్చే ఏడాది తమిళనాడు అసెం బ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్ర రాజకీయాలు అప్పుడే వేడెక్కాయి.

వివరాలు 2లో..

## ముంబై గణేశుడికి రూ. 474 కోట్ల బీమా..

- ముంబై జీఎస్‌బీ సేవా మండల్ గణేశుడికి రూ. 474.46 కోట్ల భారీ బీమా
- గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన ఇన్సూరెన్స్ కవరేజీ
- విపరీతంగా పెరిగిన బంగారం, వెండి ధరలే ప్రధాన కారణం
- స్వామివారికి 66 కిలోల బంగారం, 336 కిలోల వెండి ఆభరణాలు
- సిబ్బంది, వాలంటీర్ల కోసమే రూ. 375 కోట్ల వ్యక్తిగత ప్రమాద బీమా
- భక్తులు, మండపం రక్షణకు మరో రూ. 30 కోట్ల కవరేజీ



పెన్ పవర్ డెస్క్:దేశంలోనే అత్యంత సంపన్న గణేష్ మండలిగా పేరుగాంచిన ముంబై కింగ్స్ సర్కిల్‌లోని జీఎస్‌బీ సేవా మండల్, ఈ ఏడాది గణేష్ చతుర్థి ఉత్సవాల కోసం భారీ బీమా చేయించింది. ఈ సంవత్సరం ఏకంగా రూ. 474.46 కోట్ల విలువైన బీమా పాలసీని తీసుకోవడం విశేషం. గత ఏడాది

వివరాలు 2లో..

## దమ్ముంటే అమరావతిలో పర్యటించాలి: జగన్ కు దేవినేని ఉమా సవాల్

- అమరావతి వచ్చి అభివృద్ధి చూడాలంటూ జగన్‌కు ఉమ సవాల్
- కుంభకోణాల వారి కోసం జైలు యాత్రలు మానాలని హితవు
- అమరావతి మునగలేదని నిరూపిస్తామన్న దేవినేని
- ఉచిత బస్సు పథకంపై ఈర్ష్యతోనే జగన్ విమర్శలు అని ఆరోపణ
- రాజధానిపై వైసీపీది దుష్ప్రచారం అంటూ తీవ్ర విమర్శలు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ అధినేత జగన్ కు టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి దేవి నేని ఉమామహేశ్వరరావు సవాల్ విసిరారు. దమ్ముంటే అమరా వతిలో పర్యటించాలని, ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని స్వయంగా

వివరాలు 2లో..

## నేడు తీరాన్ని దాటనున్న వాయుగుండం... ఏపీకి వర్ష సూచన

- బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడనం
- ఉదయానికి వాయుగుండంగా మారే అవకాశం
- దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య తీరం దాటే సూచన
- కోస్తాంధ్రలో పలుచోట్ల భారీ వర్షాలకు ఛాన్స్
- తీరం వెంబడి గంటకు 60 కి.మీ వేగంతో గాలులు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం మరింత బలపడి కోస్తాంధ్ర వైపు దూసుకొస్తోంది. ఇది మంగళవారం ఉదయానికి వాయుగుండంగా

వివరాలు 2లో..

## తాడిపత్రిలో హైటెన్షన్.. రోడ్డుపైనే కుర్చీ వేసుకుని కేతిరెడ్డి నిరీక్షణ

- తాడిపత్రిలో మళ్లీ భగ్గుమన్న రాజకీయ వైరం
- తాడిపత్రిలోకి వెళ్లేందుకు యత్నించిన కేతిరెడ్డిని అడ్డుకున్న పోలీసులు
- ఆరు గంటలుగా నడిరోడ్డుపై కుర్చీ వేసుకుని నిరసన
- శాంతిభద్రతల సమస్యల దృష్ట్యా అనుమతి నిరాకరణ
- కోర్టు ఆర్డర్ ఉన్నా ప్రజలు అడ్డుకుంటారన్న జేసీ ప్రభాకర్ రెడ్డి



పెన్ పవర్ డెస్క్:అనంతపురం జిల్లా తాడి పత్రిలో మరోసారి రాజకీయ వేడి రాజుకుంది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మధ్య సవాళ్లతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాడిపత్రిలోకి ప్రవేశించాలన్న పట్టుదలతో ఉన్న కేతిరెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో, ఆయన ఏకంగా ఆరు గంటలుగా నడిరోడ్డుపైనే కుర్చీ వేసుకుని నిరీక్షిస్తుండటం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది.సోమవారం ఉదయం, పోలీసుల సూచనలను పక్కనపెట్టి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఎర్రగుంటపల్లి ఫ్లైఓవర్ వద్ద శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అదే సమయంలో, హైకోర్టు అనుమతితో తాడిపత్రికి వస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డిని పోలీసులు నాగిరెడ్డిపల్లె వద్ద నిలిపివేశారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని పేర్కొంటూ ఆయనకు

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# యుద్ధానికి తెరపడేదెన్నడు.. ఇలా ఎన్నాళ్లు

తాడిపత్రి నియోజకవర్గం ఎప్పుడూ వార్తల్లోనే ఉంటుంది. అక్కడ ఎవరు అధికారంలో ఉన్నప్పటికీ నిత్యం రగులుతూనే ఉంటుంది. మాజీ ఎమ్మెల్యేలు పెద్దారెడ్డి, జేసీ ప్రభాకర్ రెడ్డిల మధ్య సవాళ్ల పర్వం నిత్యం నడుస్తూనే ఉంటుంది. ఈరోజుతో మొదలయిన యుద్ధం కాదిది. కొన్ని దశాబ్దాల నుంచి జరుగుతున్న వార్ కావడంతో దీనికి తెరపడే అవకాశం లేదన్నది వాస్తవం. అధికారంలో ఉన్నవాళ్లు రెచ్చిపోవడం, ప్రతిపక్షంలో ఉన్నవాళ్ల కొంత తగ్గుతుండటం ఇక్కడ మామూలుగానే కనపడుతుంది. 2019 ఎన్నికల వరకూ జేసీ కుటుంబానిదే తాడిపత్రిలో ఆధిపత్యం నడిచేది. అయితే ఆ ఎన్నికల్లో తొలిసారి అక్కడ వైసీపీ జెండా ఎగిరింది. కేతిరెడ్డి పెద్దారెడ్డి విజయం సాధించడంతో మొదలయిన యుద్ధం నేటికీ ముగియలేదు.

**జేసీ కుటుంబం గెలవడంతో...**

మొన్నటి ఎన్నికల్లో జేసీ ప్రభాకర్ రెడ్డి కుమారుడు అస్మిత్ రెడ్డి ఎమ్మెల్యేగా తాడిపత్రిలో విజయం సాధించారు. ఇక అప్పటి నుంచి జేసీ ప్రభాకర్ రెడ్డి హవా మొదలయింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న కేతిరెడ్డి పెద్దారెడ్డి జేసీ ప్రభాకర్ రెడ్డి ఇంటిపై తన అనుచరులతో కలిసి దాడి చేయడమే కాకుండా ఫర్నీచర్ ను కూడా ధ్వంసం చేశారు. వాహనాలతో పాటు ఫర్నీచర్ ను కూడా తగులపెట్టారు. ఆ సమయంలో జేసీ ప్రభాకర్ రెడ్డి తాడిపత్రిలో లేరు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎక్కువ సమయం జేసీ ప్రభాకర్ రెడ్డి కుటుంబం హైదరాబాద్ లోనే ఉండేది. ఇప్పుడు తాడిపత్రిలో జేసీ కుటుంబం చేతిలోకి మళ్లీ రావడంతో ఆయన ఇక పెద్దారెడ్డిని అడగుపెట్టనివ్వడం లేదు.

**అడ్డుకున్నప్పటికీ...**

తాడిపత్రికి వచ్చేందుకు అనేకసార్లు కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రయత్నించినా పోలీసులు శాంతి భద్రతల సమస్య పేరు చెప్పి అడ్డుకున్నారు. ఆయనను జిల్లాలోని వేరే ప్రాంతానికే పరిమితం చేశారు. అయితే పెద్దారెడ్డి మాత్రం హైకోర్టుకు వెళ్లి మరోసారి ఆదేశాలు తెచ్చుకున్నారు. పోలీసులే దగ్గరుండి పెద్దారెడ్డిని తాడిపత్రికి తీసుకెళ్లాలని, ఆయనకు భద్రతను కల్పించాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో నేడు తాడిపత్రికి పెద్దారెడ్డి చేరుకోనున్నారు. మరొకవైపు జేసీ ప్రభాకర్ రెడ్డి కూడా ఈరోజు తాడిపత్రిలో శివుడి విగ్రహాన్ని ఆవిష్కరించే కార్యక్రమాన్ని పెట్టారు. దీనికి పెద్దయెత్తున కార్యకర్తలు తరలి రావాలని కోరారు. దీంతో తాడిపత్రి లో టెన్షన్ నెలకొంది. పోలీసులు ఇద్దరి మధ్య నలిగిపోతున్నారు. కానీ మరోసారి పెద్దారెడ్డిని అడ్డుకోవడంతో ఆయన రాకపోవడంతో కొంత పరిస్థితులు సద్దుమణిగాయని పోలీసులు చెబుతున్నారు. మరోసారి జేసీ ప్రభాకర్ రెడ్డి దమ్ముంటే తాడిపత్రికి రా అని ఛాలెంజ్ విసిరారు.

# వైసీపీ విష ప్రచారాన్ని తిప్పికొట్టండి

- మొదటి పేజీ తరువాయి

ఎప్పటికప్పుడు ఖండించాలి... మంత్రులు, పార్టీ నేతలు ఈ విషయంలో మరింత చొరవ చూపాలి. లేకపోతే ప్రజలు ఆ తప్పుడు ప్రచారాలనే నిజం అని నమ్మే స్థాయికి తీసుకువెళతారు. మంచి గురించి మాట్లాడడమే కాదు... చెడు చేసే వారి గురించి కూడా ప్రజలను చైతన్య పరచాలి. మనపై చేసే అసత్య ప్రచారాలను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇంఛార్జ్‌లు, కార్యకర్తలు మరింత క్రమశిక్షణతో ఉండాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వం చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం విజయవంతమైందని చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.24 కోట్ల కుటుంబాలను నేరుగా కలిసి, ప్రభుత్వ పథకాలను వివరించామని అన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని నాయకుల పర్యటనలను పర్యవేక్షించామని... ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇంఛార్జ్‌లు ఏ గ్రామానికి ఏ సమయంలో వెళుతున్నారో యాప్ ద్వారా తెలుసుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజల్లో పూర్తి సంతృప్తి, సానుకూలత వ్యక్తమవుతోందని, ఎన్నికల్లో ఇచ్చిన సూపర్-6 హామీలను అమలు చేస్తుండటంతో ప్రజలు ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలకు చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో చెడు చేసే వారి గురించి కూడా ప్రజలను చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నేతల మాటలు, చేతలు పార్టీకి గానీ, ప్రభుత్వానికి గానీ చెడ్డపేరు తెచ్చేలా ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ మరింత బాధ్యతగా, క్రమశిక్షణతో వ్యవహరించాలని, వివాదాలకు ఏమాత్రం ఆస్కారం ఇవ్వొద్దని హెచ్చరించారు.

పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు న్యాయం చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్ కమిటీలు, కార్పొరేషన్లకు ఛైర్మన్‌లను నియమించామని, త్వరలోనే మిగిలిన నామినేటెడ్ పదవులను కూడా భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉపఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన నేతలు, కార్యకర్తలను ఆయన అభినందించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగడం వల్లే ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేశారని, ఇది రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు.

# రాష్ట్ర అభివృద్ధికి పోర్టులే కీలకం.. చేయూతనివ్వండి

- మొదటి పేజీ తరువాయి

ముఖ్యంగా, పోర్టుల ఆధారిత అభివృద్ధి, జలరవాణా ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తే రాష్ట్ర ప్రగతి మరింత వేగవంతం అవుతుందని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రతిపాదనలను, ప్రాజెక్టుల వివరాలను ఆయన కేంద్ర మంత్రి ముందు ఉంచారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించడంలో, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో పోర్టులు కీలక పాత్ర పోషిస్తాయని మంత్రి లోకేశ్ కేంద్ర మంత్రికి తెలియజేశారు.

రాష్ట్ర విజ్ఞప్తులపై

కేంద్ర మంత్రి సోనోవాల్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# జగన్‌కు రాజ్‌నాథ్ సింగ్ ఫోన్... మద్దతిస్తారా?

- మొదటి పేజీ తరువాయి

అభ్యర్థి రాధాకృష్ణన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యేందుకు సహకరించాలని ఆయన జగన్‌ను కోరారు. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీపై జగన్ పరోక్ష విమర్శలు చేసిన నేపథ్యంలో ఈ ఫోన్ కాల్‌కు రాజకీయంగా ప్రాధాన్యత ఏర్పడింది. ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న సమయంలో, ఎన్డీఏ తమ అభ్యర్థిగా రాధాకృష్ణన్‌ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆయన ఎన్నికను ఏకగ్రీవం చేసే ప్రయత్నాల్లో భాగంగా బీజేపీ నాయకత్వం వివిధ పార్టీల మద్దతు కూడగడుతోంది. ఈ క్రమంలోనే రాజ్‌నాథ్ సింగ్ స్వయంగా జగన్‌తో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ ప్రస్తుతం తెలుగుదేశం, జనసేన పార్టీలతో కూటమిలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తన రాజకీయ ప్రత్యర్థులతో కలిసి ఉన్న బీజేపీకి జగన్ మద్దతు ఇస్తారా లేదా అన్నది ఉత్కంఠగా మారింది. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జగన్ తీసుకోబోయే నిర్ణయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# దమ్ముంటే అమరావతిలో పర్యటించాలి: జగన్ కు దేవినేని ఉమా సవాల్

చూడాలని అన్నారు. సోమవారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దేవినేని మాట్లాడారు. కుంభకోణాలు, అక్రమాలకు పాల్పడిన వారి కోసం జైలు యాత్రలు చేయడం మానుకుని, రాజధాని పర్యటనకు రావాలని జగన్‌ను ఉద్దేశించి దేవినేని వ్యాఖ్యానించారు. రాజధానిలోని సీడ్ యాక్సెస్ రోడ్డు, సచివాలయం, విట్, ఎస్ఆర్ఎం వంటి ప్రాంతాలకు జగన్ ఎక్కడికి రమ్మంటే అక్కడికి తాము వస్తామని చెప్పారు. అమరావతి ఎక్కడా మునిగిపోలేదని నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకానికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే జగన్, అమరావతిపై విష ప్రచారం చేస్తున్నారని దేవినేని ఉమ ఆరోపించారు. జగన్ మానసిక పరిస్థితి ఏంటో ప్రజలకు అర్థమవుతోందని, అమరావతి అభివృద్ధిని సహించలేకే వైసీపీ నేతలు ఇలాంటి దుష్ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# ముంబై గణేశుడికి రూ. 474 కోట్ల బీమా..

- మొదటి పేజీ తరువాయి

ఈ మొత్తం రూ. 400 కోట్లుగా ఉండగా, ఈసారి గణనీయంగా పెరిగింది.

**బంగారం ధరలే కారణం**

ఈ బీమా కవరేజీ ఇంత పెద్ద మొత్తంలో పెరగడానికి ప్రధాన కారణం బంగారం, వెండి ఆభరణాల విలువ పెరగడమేనని నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం స్వామివారికి అలంకరించే 66 కిలోల బంగారం, 336 కిలోల వెండి ఆభరణాల విలువ అధికంగా ఉంది. గత సంవత్సరం 10 గ్రాముల బంగారం ధర రూ. 77,000 ఉండగా, ప్రస్తుతం అది రూ. 1,02,000కి చేరింది. ఈ కారణంగానే కేవలం ఆభరణాల రక్షణ కోసం తీసుకున్న 'ఆల్-రిస్క్' పాలసీ విలువ గత ఏడాది రూ. 43 కోట్ల నుంచి ఈసారి రూ. 67 కోట్లకు పెరిగింది.ల

**విభాగాల వారీగా బీమా వివరాలు**

ఈ మొత్తం రూ. 474.46 కోట్ల పాలసీలో అధికభాగం వాలంటీర్లు, పూజారులు, వంట సిబ్బంది, భద్రతా సిబ్బంది వంటి వారి వ్యక్తిగత ప్రమాద బీమా కోసమే కేటాయించారు. దీని విలువ రూ. 375 కోట్లుగా ఉంది. మండపానికి వచ్చే భక్తులు, పండల్, ఇతర నిర్మాణాల రక్షణ కోసం ప్రజా బాధ్యత (పబ్లిక్ లయబిలిటీ) కింద రూ. 30 కోట్ల కవరేజీని తీసుకున్నారు. అగ్నిప్రమాదాలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ కోసం తీసుకున్న బీమా విలువలో మార్పు లేదు. ఇది గత సంవత్సరం మాదిరిగానే రూ. 2 కోట్లుగా ఉంది. అదనంగా, ఉత్సవాలు జరిగే ప్రాంగణం కోసం మరో రూ. 43 లక్షల పాలసీని కూడా తీసుకున్నట్లు న్యూ ఇండియా అస్యూరెన్స్ సంస్థ వెల్లడించింది.

# నేడు తీరాన్ని దాటనున్న వాయుగుండం... ఏపీకి వర్ష సూచన

- మొదటి పేజీ తరువాయి

మారి దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో కోస్తాంధ్ర జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు. వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. పరిస్థితులు ప్రమాదకరంగా మారే అవకాశం ఉన్నందున, మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లరాదని ఆయన స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వాయుగుండం కారణంగా మంగళవారం కోస్తాంధ్రలోని పలు ప్రాంతాల్లో చెదురుమదురుగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడతాయని తెలిపారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ఇప్పటికే అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం సాయంత్రం 5 గంటల సమయానికి అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో అత్యధికంగా 73 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మన్యం జిల్లా గుళ్లసీతారామపురంలో 66 మి.మీ, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో 60.2 మి.మీ, అల్లూరి జిల్లా కొత్తూరులో 59.5 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు.

## ఉక్రెయిన్ పై ఆగని రష్యా దాడులు...

# ఖార్కివ్ పై డ్రోన్ దాడి... పలువురు మృతి

- మొదటి పేజీ తరువాయి

ఈ ఘటనతో ఉక్రెయిన్ మరోసారి ఉలిక్కిపడింది. వివరాల్లోకి వెళితే, ఈరోజు ఖార్కివ్‌లోని ఓ ఐదంతస్తుల నివాస భవనంపై రష్యా డ్రోన్‌తో దాడి చేసింది. ఈ ఘటనలో ఐదుగురు పౌరులు మరణించగా, మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. క్షతగాత్రుల్లో ఆరుగురు చిన్నారులు ఉన్నట్లు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగి, శిథిలాల కింద చిక్కుకున్న ఓ యువకుడిని, యువతిని సురక్షితంగా బయటకు తీశాయి. ఈ దాడికి కొన్ని గంటల ముందు, అంటే నిన్న సాయంత్రం కూడా ఖార్కివ్‌పై రష్యా క్షిపణి దాడికి పాల్పడింది. ఆ ఘటనలో 13 ఏళ్ల బాలుడితో సహా ఎనిమిది మంది గాయపడ్డారని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు, గత శుక్రవారం రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలో ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడిలో ఒకరు మరణించగా, 10 మంది గాయపడినట్లు రష్యా ప్రాంతీయ గవర్నర్ అలెగ్జాండర్ ఖిన్‌ష్టెయిన్ తెలిపారు. నగరంలోని రైల్వే జిల్లాలో ఉన్న ఓ భవనంపై డ్రోన్ దాడి జరగడంతో పై నాలుగు అంతస్తుల్లో మంటలు చెలరేగినట్లు సమాచారం. ఇలా ఇరు దేశాలు దాడులతో రెచ్చిపోతున్న తరుణంలోనే, ఆగస్టు 15న అమెరికాలోని అలస్కాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య కీలక సమావేశం జరిగింది. సుమారు మూడు గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో ప్రధానంగా ఉక్రెయిన్ యుద్ధంపైనే దృష్టి సారించారు. ఈ భేటీ అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. కాల్పుల విరమణ కాకుండా, ఇరు దేశాల మధ్య ప్రత్యక్ష శాంతి ఒప్పందం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడ్డారు. దౌత్యపరమైన చర్చలతో లక్షలాది ప్రాణాలను కాపాడవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్టాలిన్‌ను మళ్లీ సీఎం కానివ్వను

- మొదటి పేజీ తరువాయి

ఏఐఏడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను ఉద్దేశించి ఆమె తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీని గెలవనివ్వబోనని, స్టాలిన్‌కు మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వనని ఆమె శపథం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పాలనపై శశికళ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'అమ్మ' జయలలిత హయాంలో తమిళనాడు ఎంతో అభివృద్ధి సాధించిందని, కానీ నేటి పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని ఆవేదన చెందారు. "ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే నాకు రాత్రిళ్లు నిద్ర కూడా సరిగా పట్టడం లేదు. మేం ప్రజలకు మంచి పాలన అందించాం. అందుకే ఇప్పటి పరిస్థితులు చూస్తే ఆ బాధ ఎలా ఉంటుందో మాకే తెలుసు. స్టాలిన్, మిమ్మల్ని మరోసారి అధికారంలోకి రానివ్వను" అని ఆమె స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా, గత ఏఐఏడీఎంకే ప్రభుత్వం తీసుకున్న ఓ నిర్ణయాన్ని కూడా శశికళ తప్పుపట్టారు. పారిశుద్ధ్య కార్మికుల వ్యవస్థను ప్రైవేటీకరించడం సరైన చర్య కాదని ఆమె విమర్శించారు. జయలలిత జీవించి ఉంటే అలాంటి నిర్ణయానికి ఎప్పటికీ అంగీకరించేవారు కాదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు అన్నీ ఆలోచించి ఓటు వేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## తాడిపత్రిలో హైటెన్షన్.. రోడ్డుపైనే

# కుర్చీ వేసుకుని కేతిరెడ్డి నిరీక్షణ

- మొదటి పేజీ తరువాయి

అనుమతి నిరాకరించారు. దీంతోపాటు టీడీపీ కార్యకర్తలు కూడా ఆయనను అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల చర్యతో ఆగ్రహానికి గురైన పెద్దారెడ్డి, అక్కడే రోడ్డుపై కుర్చీ వేసుకుని బైఠాయించారు. తాడిపత్రిలోకి తనను అనుమతించే వరకు కదిలేది లేదని తేల్చిచెప్పారు. ఆరు గంటలకు పైగా అక్కడే ఉండిపోయిన ఆయన, భోజనం కూడా అక్కడే చేశారు. ఆయనకు మద్దతుగా వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ పరిణామాలపై జేసీ ప్రభాకర్ రెడ్డి స్పందించారు. కేతిరెడ్డికి కోర్టు ఆర్డర్ ఉన్నా, ఆయన బాధితులు మాత్రం ఊరిలోకి రానివ్వరని అన్నారు. గతంలో పొట్టి రవి విషయంలోనూ కోర్టు ఆదేశాలున్నా పెద్దారెడ్డే పోలీసులను అడ్డం పెట్టుకుని అడ్డుకున్నారని జేసీ ఆరోపించారు. తాము కోర్టును గౌరవిస్తామని, కానీ ప్రజలు మాత్రం పెద్దారెడ్డిని అడ్డుకోవడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు. ముందుజాగ్రత్త చర్యగా తాడిపత్రి సరిహద్దుల్లో 750 మందికి పైగా పోలీసులను మోహరించారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి రోడ్డుపైనే నిరీక్షిస్తుండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# సినీ కార్మికుల సమ్మె.. రంగంలోకి చిరంజీవి

- మొదటి పేజీ తరువాయి

ఆయన తెలిపారు. సాధ్యం కాని, అమలు చేయలేని నిబంధనలు పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులతో పాటు నిర్మాతలు కూడా బాగుండాలని, కానీ నిర్మాతలు పెట్టిన రెండు షరతులకు తాము ఒప్పుకుంటే నష్టపోతామని అనిల్ అన్నారు. ఈ విషయాన్ని చిరంజీవి దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. 'మీకు ఏ సమస్య ఉన్నా నా దగ్గరకు రండి' అని చిరంజీవి తమకు భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు. మంగళవారం జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేస్తామని, ఛాంబర్ నుంచి కూడా తమకు పిలుపు వచ్చిందని అన్నారు. చర్చలకు పిలిచారు కాబట్టి తాము ప్రస్తుతానికి నిరసన కార్యక్రమం ఆపేశామని తెలిపారు. తాము అడిగినట్లు వేతనాలు వస్తాయని భావిస్తున్నామని అన్నారు.

# మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలపాలి.

సబ్ కమిటీ సమావేశంలో కోరిన ఎమ్మెల్యే వేగుళ్ళ.



**మండపేట. పెన్ పవర్.ఆగస్టు 18 :**మండపేట నియోజక వర్గం ను రాజమహేంద్రవరం కేంద్రం గా ఉన్న తూర్పు గోదావరి జిల్లా లో విలీనం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శాసన సభ సబ్ కమిటీ సభ్యులు కు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక మీడియా తో మాట్లాడుతూ ఈ నెల 13 బుధవారం అమరావతిలో వినతి పత్రాన్ని అందజేసినట్లు చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ సభ్యులతో జరిగిన సమావేశంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా మండపేట నియోజకవర్గ ప్రజల కోరిక మేరకు మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం కేంద్రంగా గల తూర్పు గోదావరి జిల్లాలో కలపాలని సబ్ కమిటీని కోరారు. దీనిపై వారంతా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వేగుళ్ళ తెలిపారు.

పెన్ పవర్
ఉభయ గోదావరి
కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు

# జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో

# "ప్రజా సమస్యల పరిష్కార వేదిక



జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 18 :**జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల వ్రాతపూర్వక అర్జీలను జిల్లా ఎస్పీ స్వయంగా స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.వెంటనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇవ్వాలి అని, "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, భాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని, ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పి అధికారులను ఆదేశించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలపై 26 మంది ఫిర్యాదీదారులు వారి సమస్యలను జిల్లా ఎస్పీ కి విన్నవించుకున్నారు.

# ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

– జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 18 :**జిల్లాలో ఎరువులు పక్కదారి పట్టి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు ఖరీఫ్ వ్యవసాయ పనులు ఇంకా ముమ్మరంగా సాగుతున్న క్రమంలో ఎరువులు సమృద్ధిగా ఉన్నట్టు తెలిపారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని వివరించారు.కిలో ఎరువు కూడా పక్కదారి పడడానికి వీల్లేదన్నారు.సాగు అవసరాల మేరకే ఎరువులు తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎరువుల లెక్కలకు సంబంధించి భౌతికంగా ఆన్లైన్ రికార్డులతో లావా దేవీలు పారదర్శకంగా ఉండాలన్నారు యూరి యాతో పాటు,డీఏపీ, ఎంవోపీ, ఎస్. ఎస్.పి. కాంప్లెక్సు.ఎరువులు అందుబాటులోఉన్నాయని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకే వాటిని వినియోగించాలని సూచించారు.నానో ఎరువుల వినియోగంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

పశ్చిమ వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్లరాదని పల్లపు, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వరదలు,వర్షాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. కోనసీమ జిల్లాలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు జిల్లాలో ఈదురు గాలులు, మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచించిందన్నారు.ఈ మేరకు వర్షాల సహాయక చర్యల నిమిత్తం కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్ చేశామని 08856బి 293104 ఇది 24 గంటలు పని చేస్తుందన్నారు.ఆర్డీఓ కార్యాలయాలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలంతా అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఆయన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా వరల కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం.



**కె గంగవరం పెన్ పవర్ ఆగస్టు 18:**కె.గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో సోమవారం మహా గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, వరాల కనకదుర్గ అమ్మవారి సువర్ణయంత్ర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.ఉదయం 11 గంటలకు విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం వైభవంగా జరిగింది.అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ వేడుకను జయప్రదం చేశారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ కార్యక్రమానికి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు పువ్వుల కిరీటం సమర్పించి, సాలువాతతో మంత్రి సుభాష్‌ను ఘనంగా సత్కరించారు.

# మెర్లపాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించిన అధికారులు-విద్యార్థుల భద్రతకు చర్యలు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 18:** ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుపాను ప్రభావం కారణంగా పాఠశాల భవనాల పరిస్థితిని పరిశీలించేందుకు అధికారులు సోమవారం పర్యటించారు. ఎంపిడిఓ బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్, మండల విద్యాశాఖాధికారి పి.వి. ప్రసాదరావు మెర్లపాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించారు.

ఈ సందర్భంగా అధికారులు ఉపాధ్యాయులకు సూచిస్తూ - విద్యార్థుల భద్రతను ప్రథమ కర్తవ్యంగా తీసుకోవాలని, ఎటువంటి అనుకోని పరిస్థితులు తలెత్తినా వెంటనే అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అవసరమైతే విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు.

# వర్షం కారణంగా రోడ్లపై వరద నీరు



రవాణా అంతరాయం

**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 18:**చింతూరు మండలంలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో రోడ్లపైకి వరద నీరు చేరింది. ఎడుగురాళ్లపల్లి, చింతూరు గ్రామాల మధ్య ప్రధాన రహదారి సోమవారం సాయంత్రం భారీగా వరద నీటితో మునిగిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరద ఉధృతికి రోడ్డు పైభాగం కొట్టుకుపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. స్థానికులు మాట్లాడుతూ అయినా సరే కార్లు, బైక్‌లపై ప్రయాణం చేసే వారు ఆగడం లేదు. ఇది ప్రమాదకరంగా మారవచ్చు అని ఆందోళన వ్యక్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎటువంటి హాని జరగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి...



**అమలాపురం రూరల్, పెన్ పవర్ ఆగస్టు 18:** నిరంకుశత్వాన్ని ఎదిరించి తెలంగాణలో తొలి బహుజన చక్రవర్తిగా చరిత్రకెక్కిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా సోమవారం కామనగరువులో ఉన్న సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు. కార్యక్రమంలో రాజులపూడి భీముడు,రాష్ట్ర %ంఎ% సెల్ ఉపాధ్యక్షులు పొలమూరి ధర్మపాల్,మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మిబాబ్జి, కామనగరువు టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు వాకా శ్రీను,కామన రాజు, రాజులపూడి భాస్కరరావు,రాజులపూడి నాగేశ్వరరావు,కాట్రు కృష్ణ తదితరులు పాల్గొన్నారు...

## మట్టి గణేశ ప్రతిమలనే పూజించండి

**సూర్య పీఠం ట్రస్టు ఫౌండర్ ట్రస్టీ తోట సాయిబాబా**



**గోకవరం, పెన్ పవర్, ఆగస్టు 18 :** గణపతి నవరాత్రులలో మట్టి గణేశుని పూజించాలని సూర్య పీఠం ట్రస్టు ఫౌండర్ ట్రస్టీ తోట సాయిబాబు పిలుపునిచ్చారు.సాయిబాబా మాట్లాడుతూ ఆనాడు పర్యావరణ పరిరక్షణార్థం భారతీయ ఋషులు ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రులు ఈనాడు పర్యావరణానికి పెను ప్రమాదంగా మారాయని దానికి ఏకైక కారణం మట్టి గణేశునికి బదులుగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వాడకమేనని అన్నారు. ఔషధ లక్షణాలు కలిగిన 21 రకాల పత్రములతో పూజించిన మట్టి గణేశ ప్రతిమను నీటి యందు నిమజ్జనం చేయడం ద్వారా జలకాలుష్యము భూ కాలుష్యము నివారింపబడి జలశుద్ధి భూశుద్ధి జరుగుతాయని ఫలితంగా సమస్త జీవరాసులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లుతాయని ఈ విలువైన అంశమే గణేశ నిమజ్జనంలో అంతర్లీనంగా దాగివున్న అసలు సిసలైన ఆరోగ్య సూత్రమని అన్నారు.ప్రమాదకరమైన రసాయనాలతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు నీటి యందు నిమజ్జనం చేయడం ద్వారా నీటి కాలుష్యము భూ కాలుష్యము ఏర్పడి దాని ఫలితంగా సమస్త జీవరాసుల ఆయురారోగ్యాలపై తీవ్ర ప్రభావం ఏర్పడి అన్ని జీవరాసులు అనారోగ్యాల పాలవుతున్నాయని ఇది ధర్మ విరుద్ధమని ఇది మంచి కార్యక్రమం కాదని అన్నారు. ఇకనైనా గణేష మండప నిర్వహకులు ప్రత్యేకించి యువకులు గణేశ నిమజ్జనంలో అంతర్లీనంగా దాగి ఉన్న అసలు సిసలైన ఆరోగ్య సూత్రాన్ని గ్రహించి వైదిక ధర్మాన్ని అనుసరించి మట్టి గణేశ ప్రతిమతోనే గణేష్ నవరాత్రులు జలపవలసిందిగా తోట సాయిబాబు పిలుపునిచ్చారు.

## నాడు నేడు నిధుల దుర్వినియోగానికి కారణం ఎవ్వరు?






**● ఉపాధ్యాయులా, ఇంజనీరింగ్ అధికారులా, కాంట్రాక్టర్లా**

**వై రామవరం,పెన్ పవర్, ఆగస్టు 18:** మండలంలో నాడు నేడు పేజ్ 2 లో మంజూరైన భవన నిర్మాణాలు పూర్తికాకుండానే నిధులు దుర్వినియోగం అయ్యాయని, దీనికి ఉపాధ్యాయులా, ఇంజనీరింగ్ అధికారులా కాంట్రాక్టర్లదా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

నాడు నేడు భవన నిర్మాణాలు పూర్తి కాకుండా కాంట్రాక్టర్ కు, మెటీరియల్ సప్లయర్స్ కు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు చెక్కులు ఏ విధంగా ఇచ్చారని స్థానికుల ప్రశ్నిస్తున్నారు. ఆ పాఠశాల ఉపాధ్యాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్ పర్సన్, మూడు లేదా నలుగురు పేరెంట్స్ కమిటీ సభ్యులు, పాఠశాల పరిధి సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ విధిగా తీర్మానంలో సంతకాలు చేయాలన్నారు. ఇంత పక్కా నిబంధనలు ఉన్నా నిర్మాణాలు పూర్తి కాకుండా నిధులు ఏ విధంగా దుర్వినియోగం అయ్యాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కళ్లెపు గొంది ఎంపీపీ పాఠశాల నిర్మాణంలో 4,87,271 రూపాయలు, కర్నితుల జిపిఎస్ పాఠశాలలో 7,31,800 రూపాయలు, డి మామిడాడ జిపిఎస్ పాఠశాలకు సంబంధించి 7,32,900 రూపాయలు, పూలోవ జిపిఎస్ పాఠశాలకు సంబంధించి 1,80,600 రూపాయలు, చాపరాయి జిపిఎస్ పాఠశాలకు సంబంధించి 7,31,900 రూపాయలు, గంగనూరు జిపిఎస్ పాటశాల నిర్మాణంలో 9,26,900 రూపాయలు ఖర్చు చూపించారని నిర్మాణాలు పూర్తి కాలేదని ఆయా పాఠశాలల పరిధిలోని తల్లిదండ్రుల ఆరోపిస్తున్నారు. ఈ అసంపూర్తి నిర్మాణాలపై అధికారులు ఆదేశాల మేరకు ఎంఈఓ సంబంధిత ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేశారన్నట్లు తెలిసింది. ఉపాధ్యాయుల యొక్క సమాధానాలను జిల్లా అధికారులకు సమర్పించడం జరిగిందని ఎంఈఓ తెలిపారు. నిర్మాణాలు పూర్తికాకుండా ప్రజాధనం దుర్వినియోగంపై పూర్తిస్థాయి విచారణ చేసి సంబంధిత వ్యక్తులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

## బారివర్షం కారణంగా ముంపుకు గురైన వరిచేలు పొంగుతున్న డ్రైన్ లు






**అమలాపురం రూరల్, పెన్ పవర్, ఆగస్టు 18 :** మూడురోజులుగా కురిసిన బారీ వర్షాలు కారణంగా అమలాపురం శివారు సవరప్పాలెం పెంకుడుసాలలు. దగ్గర మరియు కిత్త న చెరువు పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జనవాసాలు నీటమునిగి పోవడంతో గృహాలు లోకి నీరు ప్రవేశించ కుండా నీటిని తరలించే ప్రయత్నాలు చేపడుతున్నారు. నీరు వేళ్లేందుకు మార్గం లేకపోవడంతో ప్రొక్లెయిన్ల సహయంతో డ్రైన్ లలో గుర్రపు డెక్కను తొలగించుకుంటు పూడిక తీసే పనులు చేపట్టారు. ఒక ప్రక్క వర్షం కురుస్తున్నప్పటికి రైతులు స్వయంగా పనులు చేపట్టారు. కిత్తనచెరువు నీటి సంఘం అధ్యక్షుడు బండారు వెంకటేశ్వర రావు రంగంలోకి దిగి న్యూసమనస డ్రైన్ పనులు చేపట్టారు . రైతులు ఎన్నోనష్టాలు ఎదుర్కొని అధిక పెట్టుబడులు పెట్టి సాగుచేసారు. ఒక ప్రక్క ఆక్వాచెరువుల ద్వారా సారవంత మైన భూములు చౌడుభూములుగా మారిపోతున్నప్పటికి వాటినివారణకు అవసరమైన భూసార మందులు వాడుతూ సాగు చేసుకుంటున్నారు. సకాలంలో నీరందక ఆలస్యంగా ఊడ్చిన వరి చేలు ముంపుబారిన పడి పోవడంతో లేత మూనలు కుళ్లిపోయి పెట్టిన పెట్టుబడులు నష్ట పోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. సవరప్పాలెం కిత్తనచెరువు పాతాళ్లదిబ్బ గోపవరం కూనవరం గ్రామాల లో వరిచేలన్ని నీటమునిగిపోయాయి. రంగరాజు కోడు ఓల్డ్ సమనస న్యూసమనస కూనవరం రామన్నకోడు డ్రైన్ గొరగనమూడి డ్రైన్ లు పొంగిపొర్లుతున్నాయి. వేసవిలో డ్రైన్లు తవ్వక పోవడంతో ముంపు బారిన పడినట్టు రైతులు ఆరోపిస్తున్నారు.

# ప్రత్తిపాడులో ఫోటోగ్రఫీకి 69 ఏళ్ల వారసత్వం...













**భావాలను బంధించే కళ - జ్ఞాపకాల శాశ్వత రూపం ఫోటోగ్రఫీ.....**

**ఫోటోగ్రఫీ అకాడమీ ద్వారా ఎందరో ఫోటోగ్రాఫర్లను తయారు చేసిన కృష్ణ....**

**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..**

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగష్టు 18 :**వేల భావాలను ఒక క్షణంలో బంధించి తరతరాలకు అందించే కళ ఫోటోగ్రఫీ. మనిషి కంటికి కనిపించే ప్రతి చిన్న సంఘటనను, ప్రతి మధుర జ్ఞాపకాన్ని శాశ్వతంగా నిలుపుకునే శక్తి ఈ కళలోనే ఉంది. సాధారణ దృశ్యాన్నే అద్భుతంగా మార్చగలిగే సత్తా కూడా ఒక్క ఫోటోగ్రఫీదే. అందుకే ఫోటోగ్రఫీని ఒక కళ మాత్రమే కాకుండా ఒక చరిత్రకారుడి పనిగా కూడా భావించవచ్చు.

### ముసుగు కెమెరా నుంచి మొబైల్ వరకు....

ప్రపంచ వ్యాప్తంగా 165 ఏళ్ల క్రితం ఎన్నో శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు కలిసి చేసిన ప్రయోగాల ఫలితంగా ఫోటోగ్రఫీ పుట్టింది. మొదట్లో ఫోటో తీసుకోవడం అనేది సులభమైన పని కాదు. పెద్ద కెమెరాలు, ముసుగు కప్పుకుని, గంటల తరబడి కూర్చుని పోజులు ఇవ్వాల్సిన కష్టం ఉండేది. అది కూడా కేవలం ధనికులకు మాత్రమే అందుబాటులో ఉండేది.

కాని కాలక్రమేణా సాంకేతిక విప్లవం చోటుచేసుకుంది. కెమెరాలు చిన్నవయ్యాయి, ఫిల్మ్ కెమెరాలు వచ్చాయి, తర్వాత డిజిటల్ కెమెరాలు. చివరికి మొబైల్ ఫోన్లలో కెమెరా చేరింది. ఫలితంగా నేడు చిన్నపిల్లలు కూడా తమ సెల్ఫోన్తో అద్భుతమైన చిత్రాలను తీసి సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. ఇలా ఒకప్పుడు కొద్ది మందికే అందుబాటులో ఉన్న ఫోటోగ్రఫీ, నేడు అందరి జీవితం లో భాగమైంది.

### ప్రత్తిపాడులో తొలి స్టూడియో - ఒక చరిత్ర

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం, ప్రత్తిపాడు గ్రామంలో ఫోటోగ్రఫీ చరిత్రకు ప్రత్యేక స్థానం ఉంది. 69 సంవత్సరాల క్రితం స్వర్గీయ సలాది పెరుమాళ్ళ రావు చిన్న తాటాకుల ఇల్లు అద్దెకు తీసుకుని “ఈశ్వర్ స్టూడియో” అనే పేరుతో మొట్టమొదటి ఫోటో స్టూడియో ప్రారంభించారు. ఆ రోజుల్లో ఇది ఒక విప్లవాత్మక పరిణామం. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పల్లె వాతావరణం వదిలి ప్రత్తిపాడుకే వచ్చి తమ కుటుంబ ఫోటోలు తీయించుకునేవారు. వివాహాలు, జ్ఞాపకాల కోసం, స్మృతుల కోసం ప్రజలు ఈ స్టూడియోను ఆశ్రయించారు.

పెరుమాళ్ళ రావు సాధారణ వ్యక్తి అయినప్పటికీ, ఫోటోగ్రఫీ పట్ల ఉన్న ఆసక్తి కారణంగా తన గ్రామంలోనే ఈ కళను పరిచయం చేశారు. ఆయన వద్ద ఉన్న ముసుగు కెమెరా తో తీసిన చిత్రాలు నేటికీ చూడగలిగితే ఆశ్చర్యం కలుగుతుంది. ముఖ్యంగా, ఆ పాత కెమెరా నేటికీ భద్రంగా నిల్వ ఉండడం ఒక విశేషం.

### వారసత్వాన్ని కొనసాగించిన సలాది కృష్ణ...

కాలానికి అనుగుణంగా ఈ వారసత్వాన్ని కొనసాగించిన వ్యక్తి ఆయన కుమారుడు సలాది కృష్ణ. చిన్నప్పటినుంచే తండ్రి వద్ద శిక్షణ పొంది, పాత కెమెరాలనుంచి ఆధునిక డిజిటల్ కెమెరాల వరకు అన్ని మార్పులను సులభంగా అలవాటు చేసుకున్నారు. కృష్ణ కేవలం ఫోటోలు తీయడమే కాకుండా, ఫోటోగ్రఫీని ఒక శాస్త్రంలా, ఒక కళలా భావించి అనేక ప్రయోగాలు చేశారు. ఈ క్రమంలోనే ఆయన స్థాపించిన కృష్ణ ఫోటోగ్రఫీ అకాడమీ ద్వారా వందలాది మంది యువతకు శిక్షణ ఇచ్చారు. నేడు ప్రత్తిపాడు, పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న అనేకమంది ఫోటోగ్రాఫర్లు ఆయన శిష్యులే. ఆయన ప్రతిభ, కృషిని గుర్తిస్తూ అనేక జాతీయ, రాష్ట్రస్థాయి అవార్డులు లభించాయి. ఒక పల్లెటూరి ఫోటోగ్రాఫర్గా ప్రారంభమైన ఆయన ప్రయాణం, ఫోటోగ్రఫీ లోకంలో ఒక మార్గదర్శిగా నిలిచిన విషయం ప్రత్తిపాడుకు గర్వకారణం.

### ఫోటోగ్రఫీ - ఒక జీవనాధారం

మొదట్లో కేవలం జ్ఞాపకాలను నిలుపుకునే సాధనంగా మాత్రమే భావించిన ఫోటోగ్రఫీ, నేడు లక్షలాది మందికి జీవనాధారంగా మారింది. వివాహాలు, పండుగలు, ఉత్సవాలు, రాజకీయ సమావేశాలు ఏ కార్యక్రమం ఫోటోగ్రాఫర్ లేకుండా జరగదు. ప్రత్తిపాడులోనూ అదే పరిస్థితి. పల్లె పల్లెకు కెమెరా మోసుకుంటూ వెళ్లే ఫోటోగ్రాఫర్లు, తమ కుటుంబాలకు ఆర్థికంగా బలం చేకూరుస్తున్నారు. వారిలో చాలామంది సలాది కృష్ణ శిష్యులు కావడం గర్వకారణం. ప్రతి సంవత్సరం ఆగస్టు 19న ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం జరుపుకుంటారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు గ్రామంలోని ఫోటోగ్రాఫర్లు ఒక చోట చేరి, తమ మెంటార్ అయిన కృష్ణతో ముచ్చటించారు. ఈ సందర్భంలో ఆయన మాట్లాడుతూ “ఫోటోగ్రఫీ అనేది కేవలం బటన్ నొక్కడం కాదు. మనం చూసే దానిని కొత్త కోణంలో చూపించడం, ఒక సాధారణ క్షణాన్ని అసాధారణంగా మార్చడం ఈ కళ సారాంశం. ఫోటో అంటే కేవలం కాగితం కాదు, అది ఒక కాలం, ఒక భావన, ఒక చరిత్ర.” అన్నారు. ఈ మాటలు అక్కడున్న ప్రతి ఫోటోగ్రాఫర్ మనసును తాకాయి.

### ఫోటోగ్రఫీ- భావాల భద్రపరిచే కళ

నేటి వేగవంతమైన ప్రపంచంలో ప్రతీ క్షణం మాయమవుతుంది. కానీ ఫోటోగ్రఫీ ఆ క్షణాన్ని నిలుపుతుంది. చిన్నారి తొలి అడుగు, తల్లి చిరునవ్వు, తండ్రి చెమటతో కూడిన ముఖం, తాతగారి జ్ఞాపకాలు %-% ఇవన్నీ ఫోటోగ్రఫీ ద్వారానే మనకు చిరస్థాయిగా నిలుస్తాయి. అందుకే ఫోటోగ్రఫీని కేవలం ఒక కళగా కాకుండా జ్ఞాపకాల భద్రపరిచే మంత్రికా సాధనం అని చెప్పాలి.

ప్రత్తిపాడులో 69 ఏళ్ల క్రితం ఒక చిన్న తాటాకుల ఇంట్లో ప్రారంభమైన ఈశ్వర్ స్టూడియో, నేడు ఒక వారసత్వంగా నిలిచింది. స్వర్గీయ పెరుమాళ్ళ రావు వేసిన బీజం, ఆయన కుమారుడు కృష్ణ కృషితో వృక్షమై వందలాది ఫోటోగ్రాఫర్లను తీర్చిదిద్దింది. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంలో ప్రత్తిపాడులోని ఈ కథ, ఫోటోగ్రఫీ అంటే కేవలం కెమెరా నొక్కడం కాదు %-% అది భావాలను బంధించడం, చరిత్రను నిలుపుకోవడం, తరతరాలకు జ్ఞాపకాలు అందించడం అనే సత్యాన్ని మనకు గుర్తుచేస్తుంది.

# భారీ వర్షాలు..వాగులు పొంగే ప్రమాదం..





- దేవీపట్నం పోలీసుల హెచ్చరిక..
- గోదావరి ఉధృతి..ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..
- వాగులు దాటరాదు.. చేపలు పట్టరాదు-ఎస్సై షరీఫ్ సూచన...

**దేవీపట్నం,పెన్ పవర్,ఆగస్టు18:**దేవీపట్నం మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు,వంకలు పొంగిపొర్లే అవకాశం ఉందని ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని దేవీపట్నం పోలీసు అధికారులు హెచ్చరిక జారీ చేశారు.వర్షాల కారణంగా గోదావరి నది ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్నందున ఎవరూ నది పరివాహక ప్రాంతాలకు వెళ్లరాదని,వాగులు దాటరాదని,చేపలు పట్టే ప్రయత్నాలు చేయరాదని ఎస్సై షరీఫ్ ప్రజలను కోరారు.వర్షాలు తగ్గే వరకు గ్రామస్తులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని,ప్రాణాలను పణంగా పెట్టి వాగులు దాటే ప్రయత్నం చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని పోలీసులు హెచ్చరించారు.ప్రజలు తమ ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలని,అత్యవసర పనులు తప్ప బయటకు రావద్దని,వర్షాలను నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎస్సై షరీఫ్ స్పష్టం చేశారు.దేవీపట్నం ప్రాంతంలో వరదల వల్ల ఏదైనా అప్రమత్త పరిస్థితులు ఏర్పడితే వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించాలని,సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నామని అధికారులు తెలిపారు.

# అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సింహాచలం

**గంగవరం, పెన్ పవర్, ఆగస్టు 18 :** అన్ని మండలాలలోని వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు సిబ్బంది వర్షాలు తగ్గేవరకు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం గంగవరం మండలం నెల్లిపూడి గ్రామ సమీపంలోని మెయిన్ రోడ్డు కల్వర్టును రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ లు కల్వర్టును పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్షించడం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా.సింహాచలం మాట్లాడుతూ భారీ వర్షాలు కారణంగా వాగులు వంకలు పొంగే ప్రమాదం ఉందని వర్షాలు తగ్గేవరకు కాలువలు ఎట్టి పరిస్థితుల్లో దాటువద్దని ఆయన అన్నారు. ఏజెన్సీలో అన్ని మండల కేంద్రాలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వరదలకు సంబంధించిన సమస్యలు తెలియజేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఏజెన్సీలోని పర్యటక ప్రాంతాలన్నీ వర్షాలు పూర్తిస్థాయిలో తగ్గేవరకు పర్యటకులకు ఎట్టి పరిస్థితుల్లో పర్యటక ప్రాంతాలకు అనుమతించడం జరగదని ఆయన అన్నారు. అన్ని మండలాలలో భారీ వర్షాల కారణంగా వివిధ శాఖలకు సంబంధించిన అధికారులకు సిబ్బందికి అప్రమత్తం చేసి ముఖ్యమైన ప్రాంతాలలో డ్యూటీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ అధికారుల వెంట తహసిల్దార్ సిహెచ్ శ్రీనివాసరావు, గంగవరం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్ ,రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించరు నోటీసులకు భయపడరు

ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు!



**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు 18:**తూర్పుగోదావరి జిల్లాలో కొనసాగుతున్న భారీ వర్షాల దృష్ట్యా జిల్లా మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు సోమవారం నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళితే సీతానగరం మండలంలోని కాటవరం శ్రీ మహతి ప్రైవేట్ పాఠశాలలకులేవా సెలవులు అంటూ ప్రభుత్వ పాఠశాలలకు పంపుతున్న విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన చెందుతున్నారు. భారీ వర్షాల కారణంగా జిల్లా అధికారులు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన అవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించొద్దని ఆదేశాలిచ్చినా, ప్రైవేట్యాజమాన్యాలు

తమకు పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. నోటీసులకు భయపడరు నిబంధనలను

పాటించరు.సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న ఒకవేళ జరగరాని ప్రమాదం జరిగితే దానికి బాధ్యుడు ఎవరంటూ పలువురు ఆవేదన చెందుతున్నారు. యాజమాన్యులపై తక్షణమే విద్యాశాఖ అధికారులు స్పందించి సంబంధిత యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యే


**జీలుగుమిల్లి ,పెన్ పవర్, ఆగస్టు 18:** మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు క్రోవిడి ప్రసాద్ అనారోగ్యంతో విజయవాడలోనే ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం ఈ విషయం తెలుసుకున్న పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వీడియో కాల్ ద్వారా ప్రసాదుతో నేరుగా మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పాత్రికేయ కుటుంబానికి అండగా నిలుస్తూ వైద్య ఖర్చులకోసం ఆర్థిక సహాయంగా 20 వేల రూపాయలు అందజేశారు. భవిష్యత్తులో కూడా అన్ని వి దాల సహకార అందిస్తామని ప్రసాద్ కి ఎమ్మెల్యే ధైర్యం చెప్పారు. అదేవిధంగా రాచన్నగూడెం గ్రామానికి చెందిన మడివి రాజేశ్వరమ్మ ఇల్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి అండగా బర్రింకలపాడు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ప్రమాదంలో దెబ్బతిన్న కుటుంబానికి ప్రభుత్వం తరపున, వ్యక్తిగతంగాను అండగా నిలుస్తానని ఎమ్మెల్యే బాలరాజు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కామయ్యపాలెం గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు బండారు అనిల్, తదితరులు పాల్గొన్నారు.



# అలుపెరుగని పోరాట యోధుడు - సర్దార్ సర్వాయి పాపన్న గౌడ 375వ జయంతి వేడుకలు ఘనంగా

బహుజనులకు రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాడిన యోధుడు సర్దార్ పాపన్న గౌడ






**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 18:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ 375వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ విగ్రహానికి స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

కొత్తపేట బిజెపి కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ , మండల టిడిపి ప్రధాన కార్యదర్శి గూడెల నాగేంద్ర గౌడ సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం సర్పంచ్ మెర్ల రాము మాట్లాడుతూ %–% "బహుజన వర్గాల కోసం నిజాం నవాబుల అరాచకాలను ఎదిరించి వారి మానప్రాణాలను రక్షించిన మహనీయుడు పాపన్న గౌడ. బహుజనులకు రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాడి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకున్న పోరాట స్ఫూర్తి ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలి" అన్నారు.

ఈ సందర్భంగా మండల పరిధిలోని 17 గ్రామాల నుంచి వచ్చిన అభిమానులు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అంతేకాకుండా పలు గ్రామాల్లో పాపన్న గౌడ్ విగ్రహాలకు పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జై గౌడ్ సేన ప్రధాన కార్యదర్శి వంకా రామకృష్ణ గౌడ, వేముల సూరిబాబు, మట్ట శ్రీను, మల్లవరపు నాగరాజు, ఎలిపే వీర్రాజు, నాని, సన్నపు చంటి గౌడ్ సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా వెంకటేశ్వరస్వామి మొక్కుబడి కళ్యాణం..




**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు18,**అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో మొక్కుబడి కళ్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మేడిది శ్రీనివాసరావు-అచ్యుతామణి దంపతుల అల్లుడు నిమ్మకాయల లక్ష్మణ కుమార్-జ్యోతి హారిక దంపతులచే ఆలయ ప్రధాన అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పాణింగపల్లి అనంతాచార్యులు,ఖండవిల్లి వెంకట రమణాచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి కళ్యాణం నిర్వహించారు. బాజా భజంత్రీలు,మంగళ వాయిద్యాలు నడుమ స్వామి దేవేరుల ఉత్సవమూర్తులతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి,స్వామివారి కళ్యాణాన్ని జరిపించారు.స్వామి వారి మొక్కుబడి కళ్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన చేపట్టారు. శ్రీవారి కల్యాణ మహోత్సవంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు,

మేడిది బాబ్జి, కాశీ విశ్వేశ్వరరావు,చంద్రశేఖర్,

దొరబాబు, బుచ్చబ్బాయి,

చిన్న,బుజ్జి, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు మాట్లాడుతూ స్వామివారి మొక్కుబడి కళ్యాణాన్ని నిర్వహించుకునే శ్రీవారి భక్తులు ముందుగా ఆలయ కమిటీ, ఆలయ అర్చకులను సంప్రదించాలన్నారు.

# అల్పపీడం ప్రభావంతో భారీ వర్షాలు పొంగి ప్రవహిస్తున్న సెలయేర్లు



**వై రామవరం,పెన్ పవర్, ఆగస్టు 18 :** అల్ప పీడన ప్రభావంతో మండలంలో భారీగా వర్షం కురుస్తుంది, దీని ప్రభావంతో సెలయేర్లు పొంగి ప్రవహిస్తున్నాయి.

అల్ప పీడన ప్రభావంతో శని, ఆది, సోమవారం భారీ వర్షాలకు కురిశాయని రైతులంటున్నారు. దీని ప్రభావం వలన కొండ కాలువలు,కన్నేరు, పెద్దేరు, దుమ్మ కొండ కాలువ పొంగి ప్రవహిస్తున్నాయని తెలిపారు. మెట్ట ప్రాంతంలో వరి ఊడ్చే రైతులకు ఈ వర్షం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అంటున్నారు. కొండ కాలువలు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ఏ ఒక్కరు కాలువలు దాటవద్దని, అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# నీట మునిగిన పంటలు....223 హెక్టార్ల పంట నష్టం





- ప్రత్తిపాడు మండలంలో వర్షాలతో రైతుల ఆవేదన
- పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు

**ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 18 :**గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ప్రత్తిపాడు మండల రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టేశాయి. పలు గ్రామాల్లో పంటలు నీట మునిగిపోవడంతో రైతులు నష్టభారం భరించలేక ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఒమ్మంగి, ఏలూరు, రాయవరం, పెదశంకర్లపూడి, చిన్నశంకర్లపూడి, ధర్మవరం, ప్రత్తిపాడు గ్రామాల్లో ముంపు తీవ్రంగా ప్రభావం చూపింది. అధికారులు గుర్తించిన వివరాల ప్రకారం దాదాపు 150 హెక్టార్ల వరి, 55 హెక్టార్ల రాగి, 18 హెక్టార్ల ప్రత్తి పంటలు నీటమునిగాయి.

ముంపు పరిస్థితిని అంచనా వేసేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం సోమవారం గ్రామాలను సందర్శించింది. ఈ పరిశీలనలో డా.ఎస్. దయాకర్ (ఎంటమాలజీ, మారుటేరు), డా.ఎం. రామభద్ర రాజు (పాథాలజీ, ఏ ఆర్ ఎస్), డా.ఐ. సుధీర్ కుమార్ (బ్రీడింగ్), మండల వ్యవసాయ అధికారి జోకా అమృత పాల్గొన్నారు. రైతులు శాస్త్రవేత్తలకు తమ పొలాల్లో ముంపు ప్రభావాన్ని రైతులు చూపించారు.

శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా నిల్వ నీటిని వెంటనే మురుగు కాలువల ద్వారా బయటకు పంపాలి. నీరు తగ్గిన వెంటనే ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ బూస్టర్ డోస్‌గా వేసుకోవాలి. పంటల్లో వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పంట నష్టాన్ని చూసి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక పంట మీదే జీవనం ఆధారపడి ఉంది. వర్షాలతో ముంపు రావడంతో అప్పులు తీర్చుకోవడమే గాకుండా జీవనాధారమే ప్రమాదంలో పడింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి మా సమస్యలపై చర్యలు తీసుకోవాలని రైతులు విన్నవించారు. శాస్త్రవేత్తల సూచనలు రైతులకు కొంత ఊరటనిచ్చినా, వాస్తవ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం ముందుకు రావాలని వారు కోరుతున్నారు. ముంపు ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణ ఉపశమనం, నష్ట పరిహారం కల్పించాలని రైతాంగం ప్రభుత్వాన్ని ఆశగా ఎదురుచూస్తోంది.

# ఆపదలో ఆదుకునే వాడే ఆదిబాబు

మున్సిపాలిటీ తల్లిదండ్రుల పేర ప్రెజర్ బాక్స్ బహుకరణ

**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 18:**ఆశెట్టి సత్యనారాయణ భారతమ్మ పేరిట ఆమె కుమారుడు మున్సిపల్ కౌన్సిలర్లు ఆశెట్టి నాగ దుర్గా ఆదిబాబు అమలాపురం మున్సిపాలిటీకి సుమారు లక్ష రూపాయలు ఖరీదు చేసే ఫ్రెజర్ బాక్స్ బహూకరించారు.ఈ బాక్స్ ను మున్సిపాలిటీ పరిధిలో బాక్స్ స్వల్ప మెయింటినెన్స్ కట్టించుకుని,ఇస్తుంది.ట్రాన్స్పోర్ట్ సంబంధిత వ్యక్తులు భరించాల్సి ఉంటుంది.ఈ బాక్సును అమలాపురం ఎమ్మెల్యే ఆనందరావు సమక్షంలో అందించారు. తెల్లవారితే ప్రజల యోగక్షేమాలు చూసే వ్యక్తి ఎవరంటే వార్డు ప్రజలకు తెలుసు ఒక్క ఫోన్ కొడితే క్షణాల్లో ఇంటి ముందు ప్రత్యక్షం అయ్యేవ్యక్తి ఆదిబాబు అని, రెండో వార్డ్ గురించి నిరంతరం టైం కేటాయిస్తారు పెద్దవారు అంటే చాలా గౌరవం ఆదిబాబు అంటే వార్డు ప్రజలకి ఎంతో గౌరవం వారి తల్లిదండ్రుల పేరున ఇచ్చినందుకు వార్డు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# భారీ వర్షాలకు పూర్తిస్థాయి నీటిమట్టం పుంజు కొన్న మద్దిగడ్డ ప్రాజెక్ట్....





**అడ్డతీగల ,పెన్ పవర్ ,ఆగస్టు 18:** అడ్డతీగల గ్రామాన్ని ఆనుకుని ఉన్న మద్ది గడ్డ ప్రాజెక్ట్ ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిస్థాయి నీటిమట్టాన్ని చేరుకుంది. ఎగువ నుంచి వస్తున్న భారీ కాలువలు ప్రాజెక్టులో కలవడంతో అధికారులు రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.అలాగే పెద్దేరువాగు భారీ స్థాయి నీటిమట్టంతో ఉరకలు వేస్తుంది, అడ్డతీగల మండలం వీరభద్రపురం మీదుగా వచ్చేవాగు ఈ రెండు వాగులు మండలంలోని బొంగరాలపాడు గ్రామం వద్ద కలయిక జరుగుతుంది .ఈ రెండు వాగులు ఉధృతికి మదేరు వాగు ఉరకలు వేస్తోంది, చుట్టుపక్కల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

## వనువులమ్మ అమ్మవారికి రూ.2 లక్షలు విరాళం..



**అంబాజీపేట, పెన్ పవర్, ఆగస్టు 18:**అంబాజీపేట కొర్లపాటివారిపాలెం గ్రామ దేవత శ్రీ వనువులమ్మ అమ్మవారికి స్థానిక భక్తులు రూ.2 లక్షలు విరాళం ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. గ్రామానికి చెందిన వలవల గంగారావు జ్ఞాపకార్థం ఆయన కుమారులు మనవలు ఈ విరాళాన్ని అందజేశారు. దాతలు అందించిన విరాళాన్ని ఫిక్స్ డిపాజిట్ రూపంలో ఉంచుతామని, ప్రతీ ఏటా ఉగాది నాడు నిర్వహించే శ్రీ వనువులమ్మ అమ్మవారి జాతర మహెూత్సవం సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి డిపాజిట్ పై వచ్చే వడ్డీని వినియోగిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలవల వెంకటేశ్వరరావు, వలవల బాబి, కొర్లపాటి చంటి,పత్తి శివ, నైనాల ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

## నాన్ స్టాప్ సర్వీసులో స్త్రీ శక్తి పథకం వర్తింపజేయాలి

. రాష్ట్ర వర్కర్స్ పార్టీ అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణమూర్తి డిమాండ్

**అమలాపురం. పెన్ పవర్ ఆగస్టు 18:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఆగస్టు 15 స్వతంత్ర దినోత్సవం రోజున ప్రారంభించిన శ్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకం నాన్ స్టాప్ సర్వీసులు కూడా వర్తింపజేయాలని దీనివల్ల మహిళలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో సోమవారం రాష్ట్ర వర్కర్స్ పార్టీ అధ్యక్షులు దేవాదుల సూర్యనారాయణ మూర్తి అన్నారు. ప్రభుత్వం స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు చేయడం ఆనందదాయకమని ఆయన అన్నారు.కొన్ని సర్వీసులు కే పరిమితం చేయడం వల్ల మహిళలు అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆయన తెలిపారు. అమలాపురం నుండి కాకినాడ నాన్ స్టాప్ బస్సు మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, అమలాపురం పరిసర గ్రామాల నుండి ఎంతోమంది ఆసుపత్రి పనుల మీద మరెన్నో ముఖ్యమైన పనుల మీద నాన్ స్టాప్ లో కాకినాడ వెళుతున్నారని ఈ



పథకం వారికి వర్తిస్తే వారి అందరికీ ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయన వివరించారు ప్రభుత్వం ఆలోచించి నాన్ స్టాప్ సర్వీస్ కూడా ఉచిత ప్రయాణ పథకం వర్తింప చేయాలని ఆయన కోరారు.

## సచివాలయం చెంతనే మురికి నీటి గుంత

డ్రైడే ఫ్రైడే ఎక్కడ?





**వై రామవరం, పెన్ పవర్,ఆగస్టు 18:** సచివాలయం చెంతనే మురికి నీటి గుంత ఉన్న నిరోధక చర్యలు తీసుకోవడంలో సిబ్బంది విఫలమయ్యారని స్థానికుల ఆరోపిస్తున్నారు.

లక్షలాది రూపాయల ప్రజాధనంతో మరుగుదొడ్డి అసంపూర్తి నిర్మాణం చేపట్టారని, సెప్టిక్ ట్యాంకు కోసం తీసిన గొయ్యి మురుగు నీటితో నిండి పోయిందని గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలం కావడంతో గోతి నిండా నీళ్లు ఉండడంతో మూగజీవాలకు , చంటి పిల్లలకు ప్రమాదాలు సంభవించే పరిస్థితులు ఉన్నాయని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలులలో భాగంగా గోతిని పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు. మురుగునీరు ఉండడంతో దోమలు ప్రబలే ప్రమాదాలు ఉన్నాయని, వీటివల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా డ్రైడే ఫ్రైడే లో భాగంగా మురుగు నీటి గుంత లలో బ్లీచింగ్, యాంటీ లార్వాలను స్ప్రే చేయవలసిన బాధ్యత పంచాయతీ, సచివాలయం సిబ్బందిపై ఉందని స్థానికులు అంటున్నారు.

## అక్రమంగారంగురాళ్ళు తవ్వకాలు ఆదివాసి మండల ప్రధాన కార్యదర్శి మామిడి చిన్నారెడ్డి....





**అడ్డతీగల ,పెన్ పవర్, ఆగస్ట్ 18:** అడ్డతీగల మండలం మల్లవరం మామిళు గ్రామాన్ని ఆనుకుని ఉన్న, తపస్సు కొండ అటవీ ప్రాంతంలో యదేచ్ఛగా రంగురాళ్లు తవ్వకాలు సాగుతున్నాయని,ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి మామిడి.చిన్నారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల రంగురాళ్లు తవ్వకాలు జోరందుతున్నాయని,గతంలో రంగురాళ్లు త్రవ్వకాలు సాగించే సమయంలో సొరంగాలుగాలలో మట్టి కూలిపోయి చాలామంది ప్రాణాలు కోల్పోయారని,ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఉన్న క్వారీల్లో రంగురాళ్ల త్రవ్వకాలు ఊపందుకున్నాయని చిన్నారెడ్డి తెలిపారు. కొందరు రెండు,మూడు ముఠాలుగా ఏర్పడి ఈ తవ్వకాలు సాగిస్తున్నారని ,అసలే భారీగా వర్షాలు కురుస్తున్నాయని ఈ సమయంలో మట్టి కూలిపోయి సొరంగాలు మూత పడిపోయే అవకాశాలు ఉన్నాయని, అలా జరిగితే చాలామంది ప్రాణాలు కోల్పోయే అవకాశాలు ఉన్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రంగురాళ్లు తవ్వకాలను నిలుపుదల చేయాలని మామిడి.చిన్నరెడ్డి డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎం.పురుషోత్తం పాల్గొన్నారు.

## నాటుసారా పట్టివేత... వ్యక్తి అరెస్ట్

**సీతానగరం, పెన్ పవర్, ఆగస్టు 18:**తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు అక్రమంగా నాటు సారాతరలిస్తున్న వ్యక్తిని అరెస్టు సీతానగరం మండలంలోని ఇనగంటి వారి పేట గ్రామ శివారులో ఏటి గట్టుపైనాటు సారా అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి వీరెల్లిరాము అనే వ్యక్తిని సీతానగరం ఎస్సై డి.రామ్ కుమార్ కు వచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి సుమారు 90 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాటు సారా తయారు చేస్తున్నవారు గాని గ్రామాల్లో అమ్ముతున్న వారిపైన చట్టపరమైన చర్యలు ఉంటాయని గ్రామాల్లో సారా తయారీదారుల గురించి కానీ అమ్ముతున్న వారి గురించి కానీ మాకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయని అన్నారు,

## పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు




**అమలాపురం పెన్ పవర్ ఆగస్టు 18 :**పట్టణం లోని 29 వ వార్డులో రూపాయలు 40 లక్షలతో ఆధునీకరించిన స్మశానవాటికను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సందర్శించారు. 27వ వార్డులో నూతనంగా నిర్మించిన యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ ను ఆయన ప్రారంభించారు. పట్టణంలోని నూతనంగా 34 లక్షలు వ్యయం తో నిర్మించబోయే చేపలు మార్కెట్ ఆధునీకరణ పనులకు ఎమ్మెల్యే



శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, చైర్మన్ రెడ్డి నాగేంద్ర మణి, మున్సిపల్ కమిషనర్ నిర్మల కుమార్, అమలాపురం పట్టణం టిడిపి అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ,కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు,ఆశెట్టి ఆదిబాబు,యేడిద శ్రీను, దున్నాల దుర్గ, ఆర్డిఎస్ ప్రసాద్, వలవల శివరావు,పిండి రాజా, గల్లా మీనా కుమారి, పలువురు కౌన్సిలర్లు ,మున్సిపల్ అధికారులు సిబ్బంది, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





## వరదల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి,ఎటపాక పోలీస్ వారి హెచ్చరిక :-

**ఎటపాక పెన్ పవర్ ఆగస్టు 18:**ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో ఎటపాక , కూనవరం మరియు వి.ఆర్.పురం మండలాల్లో ఎగువ ప్రాంతాల్లో వాగులు పొంగి ఉదృతంగా ప్రవహించే అవకాశం ఉందని ఎటపాక సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.కన్నపరాజు పేర్కొన్నారు. ఈ మండలాలలో ప్రజలు ఎవరు గోదావరి నదిలో గాని , వాగులు దాటటం గాని , చేపలు పట్టడం గాని చేయరాదు. కొండవాగులు ప్రవాహం ఉధృతిగా ఉండడంతో వాగుల వైపు వెళ్ళరాదని హెచ్చరించారు. అలాగే పోచవరం నుండి పాపికొండలు పర్యాటక ప్రాంతాలు ఉన్నతాధికారుల ఆదేశాలతో తాత్కాలికంగా మూసివేయడం జరిగిందన్నారు. పర్యాటకులు గమనించాలని ఆయన సూచించారు. అలాగే ఈ వర్షాల నేపథ్యంలో ఆరోగ్యపరమైన తగు జాగ్రత్తలు పాటించి సురక్షితంగా ఉండవలసిందిగా ఆయన కోరారు. సీఐ కన్నప్ప రాజు ఫోన్ నెంబర్ : 8247300037

ఎస్ఐ అప్పలరాజు ఎటపాక ఫోన్ నెంబర్ : 6304181609

ఎస్సై శ్రీలత, కూనవరం ఫోన్ నెంబర్ : 9490617850

ఎస్సై వి.ఆర్.పురం ఫోన్ నెంబర్ : 9490617851 నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.




# బహుజన రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ జయంతి వేడుకలు ఘనంగా



మొఘల్ చక్రవర్తులను ఓడించి గోల్కొండ కోటపై విజయ పతాకం ఎగరేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 18:**ర్యాలి గ్రామంలోని మెయిన్ రోడ్ వద్ద ఉన్న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ విగ్రహం వద్ద 375వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేట నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ %-% “సామాన్య కుటుంబంలో పుట్టినా మొఘల్ చక్రవర్తులను ఓడించి గోల్కొండ కోటపై విజయ పతాకం ఎగరేసిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న. ఆయన తెలంగాణ తొలి బహుజన రాజు. అన్ని వర్గాల వారిని సైన్యంలో చేర్చుకుని అలుపెరుగని పోరాటంతో ప్రజల మనసు గెలుచుకున్న నాయకుడు” అని అన్నారు. ఈ వేడుకల్లో గుడెల్ల నాగేంద్ర గౌడ్, అత్తిలి వెంకటేశ్వరరావు, వీరి కృష్ణ, మండల గౌడ సంఘ పెద్దలు, మర్లపాలెం, వెలిచేరు, రాజవరం



గ్రామాల ప్రజలు చిన్నారులు పాల్గొన్నారు. పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా పలు గ్రామాల్లో కూడా ఘనంగా వేడుకలు నిర్వహించారు.

**పాపన్న గౌడ్ – ప్రజల హృదయాల్లో చిరస్థాయి**

వరంగల్ జిల్లాలోని జనగాం మండలం ఖిలాషాపూర్‌లో 1650 ప్రాంతంలో గీతకార్మిక కుటుంబంలో జన్మించిన పాపన్న చిన్ననాటి నుంచే ధైర్యసాహసాలతో ప్రసిద్ధి పొందారు. ప్రజలపై మొఘల్ సుబేదార్లు, జమీందార్లు వేసిన అన్యాయ పన్నులను, వారి అరాచకాలను ప్రత్యక్షంగా చూసి తిరుగుబాటు తీరు కనబరిచారు.

తన మిత్రులను సమీకరించి రహస్యంగా యుద్ధ శిక్షణ ఇచ్చి సైన్యం ఏర్పాటు చేసుకున్నారు. సర్వాయిపేటలో మొదటి కోట కట్టించి తర్వాత వరుసగా 21 కోటలను నిర్మించారు. తన సైనికుల బలం పెంపొందించి, 1698లో తాటికొండ కోటను, 1708లో గోల్కొండ కోటను స్వాధీనం చేసుకున్నారు.



**పేదల పక్షపాతి – ప్రజా రాజ్యం**

సర్వాయి పాపన్న తన సొమ్ము అంతా పేదలకు పంచేవారు. చెరువులు తవ్వించి, ఆలయాలు కట్టించి, ప్రజలకు స్వేచ్ఛనిచ్చిన పరిపాలకుడిగా నిలిచారు. పన్నుల రహిత రాజ్యాన్ని నెలకొల్పి నిజమైన ప్రజారాజ్యాన్ని స్థాపించారు.తన చివరి శ్వాస వరకు మొఘల్ సేనలతో పోరాడిన పాపన్న గౌడ్ గోల్కొండ కోటలో వీరోచితంగా ప్రాణత్యాగం చేశారు. తెలంగాణ పౌరుషాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన ఈ యోధుడి విగ్రహం నేడు లండన్ ఆల్బర్ట్ మ్యూజియంలో కూడా నిలిపి ఉంచడం ఆయన గొప్పతనానికి నిదర్శనం.

# పొగాకు వాడకాన్ని మానేయాలి



**జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్**

**అమలాపురం పెన్ పవర్ జూలై 18:** ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ప్రజల హృదయ ఆరోగ్యంపై పొగాకు ప్రభావంపై దృష్టి సారిస్తుందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు.జూలై ఒకటో తేదీ నుండి 21వ తేదీ వరకు ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో పొగాకు వ్యతిరేకతపై విద్యార్థులకు అవగాహన కల్పించి సంతకాలు సేకరిం చినందుకు గాను ప్రతి మండలానికి ముగ్గురు విద్యార్థులకు ప్రోత్సాహంగా బ్యాగులను సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు బ్యాగులను పంపిణీ చేశారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు హృదయ సంబంధ వ్యాధులకు ఎలా దారితీస్తుందో అవగాహన కల్పించి పొగాకు వాడకాన్ని మానేయాలని ప్రజలు ప్రతిజ్ఞ చేయడం పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం ఈ ప్రచారం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.ప్రపంచ పొగాకు రహిత దినోత్సవం' పొగాకు వాడకానికి వ్యతి రేకంగా సంతకాల ప్రచారంలో గణనీయమైన సంఖ్యలో ప్రజలు పాల్గొని వ్యతిరేకత వ్యక్తం చేస్తూ సంతకాలు చేశారన్నారు.

పొగాకు వ్యతిరేక సంతకం ప్రచారం అంటే, పొగాకు వినియోగాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలందరూ సంతకాలు చేసి తమ మద్దతును తెలిపే ఒక వినూత్న ప్రచార కార్యక్రమమన్నారు.పొగాకు వ్యతిరేక సంతకం ప్రచారం, పొగాకు వాడకం వల్ల కలిగే హాని గురించి ప్రజలకు అవ గాహన కల్పించి పొగాకు వాడకాన్ని నిరోధించాలన్నారు. ఈ సంతకాలు ప్రభు త్వాలకు, ఆరోగ్య సంస్థలకు పంపబడతాయని తద్వారా పొగాకు నియంత్రణ చర్యలకు మద్దతు లభిస్తుందన్నారు. పొగాకు వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి అవగాహన కల్పించడానికి పొగాకు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడానికి అనేక కార్యక్ర మాలు చేపట్టారన్నారు.ఈ ప్రచారాలు పొగాకు వ్యతిరే క ఉద్యమానికి బలం చేకూరుస్తాయనీ, పొగాకు రహిత సమాజాన్ని నిర్మిం చడంలో సహాయ పడతా యన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి ఎం దుర్గారావు దొర,ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం సుమలత ఎన్ టి ఎన్ టి సి పి సోషల్ వర్కర్ కే ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో భారీగా భక్తులు పాల్గొనాలి.



**-సత్య దీక్షా ప్రసారకర్త నల్లమిల్లి కృష్ణబాబు పిలుపు.**

**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు 18**:ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానంలో ఆఖరి శ్రావణ శుక్రవారమైన ఈ నెల 22 వ తేదీన చైర్మన్ ఐవి రోహిత్,ఈవో ఈర్ల సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రత కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సత్యదేవుని కృపకు పాత్రులు కావాలని సత్యదీక్ష ప్రచారకర్త నల్లమిల్లి కృష్ణబాబు పిలుపునిచ్చారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు భారీగా భక్తులు తరలిరావాలని సోమవారం కిర్లంపూడి మండలం గెద్దనాపల్లి, చిల్లంగి, కిర్లంపూడి, భూపాలపట్నం, జగపతినగరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి కృష్ణబాబు మాట్లాడుతూ ఈ వ్రతానికి వచ్చే భక్తులు అరటిపళ్ళు, కొబ్బరికాయ,పువ్వులు తీసుకురావాలని,దేవస్థానం తరపున రాగిరూపు,జాకెట్ ముక్క ప్రసాదం,పూజ సామాన్లు అందజేస్తారని అన్నారు.పూజలో పాల్గొనే మహిళా భక్తులకు,వారి కుటుంబ సభ్యులకు శ్రీ సత్యనారాయణ స్వామి వారి అనంతలక్ష్మి,వరలక్ష్మీదేవి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఉలూరి త్రిమూర్తులు,ఆదారి అరుణ్ కుమారి, కృష్ణతులసి నాగమణి,సూర్యకుమారి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఏడు వారాల వెంకన్న ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారు





- భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 18:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం పరిశీలించారు.

ఆలయ ప్రధాన ద్వారం వెడల్పు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే, మాడవీధుల్లో భక్తుల సౌకర్యాల కల్పన, కోనేరు అభివృద్ధి పనులను కూడా పరిశీలించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాలపై డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు వివరాలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ %-% "భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. వాడపల్లి ఆలయం మరింత వైభవంగా ఉండేలా అన్ని విధాలా కృషి చేస్తాము" అని తెలిపారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకొని, అర్చకుల వేదాశీర్వచనం పొందారు.ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు, కుసంపూడి రామకృష్ణరాజు, గనిశెట్టి వీరేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రహదారులపై విరిగిపడిన భారీ వృక్షాలు.





- సహాయక చర్యలు చేపట్టిన ఎమ్మార్వో కారం.సుబ్బారావు.
- సీఐ కన్నపరాజు లు
- వృక్షాలను తొలగిస్తున్న యంత్రాలు

**ఎటపాక ,పెన్ పవర్, ఆగస్టు 18:**అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని బుట్టాయగూడెం, లక్ష్మీపురం గ్రామాల జాతీయ రాష్ట్ర రహదారులపై బారి వృక్షాలు నేల కొరిగాయి,నేలకొరిగిన బారి వృక్షాలను మండల అధికారులు యుద్ధ ప్రాతిపదికన తొలగించి రవాణా రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు,ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఈదురు గాలులకు భారీ వృక్షాల సైతం విరిగి పడుతున్నాయని, వాటి వల్ల రవాణా రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నాయని,విరిగిపడిన వారి వృక్షాలను యంత్రాల సహాయంతో రోడ్డుపై నుంచి తొలగించడం జరుగుతుందని తెలియజేశారు, ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ కన్నప రాజు, సబ్ ఇన్స్పెక్టర్ అప్పలరాజులు, ఎంపీడీవో ప్రేమ్ సాగర్ , రెవెన్యూ సిబ్బంది



వీఆర్వో వెంకటరమణ, సహాయక కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్కానింగ్ కేంద్రాలు అకస్మికతనికి





రెవెన్యూ అధికారి మాధవి

**అమలాపురం .పెన్ పవర్ ఆగస్ట్ 18:**గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఇంచార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి కొత్త మాధవి అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు వైద్యాధికారులు పి సి పి ఎన్ డి టి కమిటీ సభ్యులను ఆదేశించారు. సోమవారం ముమ్మిడివరం లోని మహిక ఆసుపత్రి నందు స్థానిక భూపయ్య అగ్రహారం సాయి రవీంద్ర ఆసుపత్రి నందు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలను అకస్మికంగా తనిఖీ చేసి లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలు తీరుపై ఆరా తీశారు.ఆడ శిశువుల జననాల పట్ల వివక్షను అరికట్టే చర్యల్లో భాగంగా జిల్లాలో పిండ లింగ నిర్ధా రణ పరీక్షల నిషేధిత (పేసీపీఎన్డీటి) చట్టాన్ని పటిష్టం గా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ నిషేధిత చట్టం పై పరీక్షలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తూ లింగ వివక్షతను పూర్తిగా రూపు మాపుతూ స్త్రీ పురుష నిష్పత్తి సమానత్వాన్ని సాధించడం ద్వారా అన్ని విధాలుగా సమాజ హితానికి అవకాశాలు మెరుగు పడతాయన్నారు ఆడశిశు జననాల పట్ల వివక్షను అరికట్టేందుకు అందరూ కృషి చేయాలన్నారు. ఇందుకు సంబం ధించి పీసీపీఎన్డీటి చట్టాన్ని పటిష్టంగా అమలు చేయా లని ఆమె ఆదేశించారు.అన్ని స్కానింగ్ సెంటర్లలో కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని డేకాయ్ తనిఖీలు నిర్వహించి చట్టాన్ని ఉల్లం ఘించిన వారిని గుర్తించి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.చట్ట ప్రకారం జరిమానాలు శిక్షలు అమలు చేస్తూ ప్రతి స్థాయిలో లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పగడ్బందీగా అమలు చేస్తూ లింగ మానత్వానికి పాటుపడాలని,ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి సిహెచ్ వి భరత లక్ష్మి, వైద్యా ధికారులు అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఓట్ చోర్ పై కాంగ్రెస్ నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ




**అమలాపురం.పెన్ పవర్ ఆగస్ట్ 18** :రాహుల్ గాంధీ కు మద్దతుగా ఎపిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలారెడ్డి పిలుపుమేరకు అమలాపురం గడియార స్తంభం సెంటర్ నందు కాంగ్రెస్ పార్టీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్యన్ని నాశనం చేస్తూ బిజెపి,ఎన్నికల కమిషన్ కలిసి చేసిన అక్రమాలకు నిరసనగా ఓటు చోర్ గద్ది చోర్ పిసిసి ఉపాధ్యక్షుల కొత్తూరు శ్రీనివాసరావు నియోజకవర్గ కన్వీనర్ అయితాబత్తుల సుభాషిని, కేకేసి అధికార ప్రతినిధి, పట్టణ అధ్యక్షులు ఒంటెద్దు బాబి,రాష్ట్ర అధికార మాజీ ప్రతినిధి ముషిని రామకృష్ణ, ఎఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర,కుడుపూడి శ్రీనివాసరావు,మహబూబ్ షకిల,మార్చ్ వరకు శివన్నారాయణ, ములపర్తి మోహన్ రావు,ఏలేశ్వరపు రాధాకృష్ణ, వస్తా బాబు, సుగ్గు ప్రసాద్, పేరి శర్మ, ముల్లేటి వెంకటేశ్వరరావు, ఈతకోట సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల మధ్య ఉన్న కల్వర్టును పరిశీలించిన ఎమ్మార్వో

**ఎటపాక ,పెన్ పవర్, ఆగస్టు 18:**అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని లోతట్టు ప్రాంతామైన వీరాయిగూడెం గ్రామానికి నెల్లిపాక గ్రామానికి మధ్య ఉన్న కల్వర్టును ఎటపాక మండల తహసిల్దార్ కారం.సుబ్బారావు పరిశీలించారు, అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ గోదావరి పెరిగే అవకాశం ఉందని వాగులు వంకలు పొంగుతున్నాయని, వాగులు దాటడం కానీ చేపలకు వెళ్లడం గాని చేయవద్దని తెలిపారు, అత్యవసర పనులు ఉంటే గాని ఇంటి నుంచి బయటకు వెళ్లాలని తెలిపారు, వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్ సాగర్, వీఆర్వో వెంకటరమణలు పాల్గొన్నారు..



## ఉప రాష్ట్ర పతి గా సి పి రాధాకృష్ణన్ అభ్యర్థిత్వం పట్ల హర్షం.

**మండపేట. పెన్ పవర్.ఆగస్టు 18:**నూతన ఉపరాష్ట్రపతిగా ఎన్ డి ఏ కూటమి అభ్యర్థి సిపి రాధాకృష్ణన్ ఎంపిక కావడం పట్ల బిజెపి సీనియర్ నాయకులు కోన స త్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.ఈ స్థానాన్ని అధిష్టించబోతున్న మూడో తమిళ నేత గా ఆయన పేర్కొన్నారు.

దక్షిణాదికి ముఖ్యస్థానం బిజెపి కల్పించిందన్నారు.

ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ చంద్రపురం పొందు స్వామి రాధాకృష్ణన్ పేరు ఖరారు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.



# రేగులపాడు లో హెల్త్ క్యాంప్



**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 18.**ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాలకు వాతావరణం లో మార్పుల వలన మండలంలోని రేగులపాడు గ్రామంలోని ప్రజలు విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారని స్థానిక సర్పంచ్ బొగ్గ రామారావు ద్వారా తెలుసుకుని కూటూరు పి హెచ్ సి డాక్టర్ ఎస్ఎస్ మూర్తి హెల్త్ క్యాంప్ నిర్వహించారు.జ్వరాలతో బాధపడుతున్న రోగులకు హెల్త్ క్యాంప్ ద్వారా మందులు,మెరుగైన వైద్య సేవలు డాక్టర్ మూర్తి,వైద్య సిబ్బంది అందించారు.ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కుంజ రాము,రాజమ్మ,గుండం అరుణ, రమణ కుమారి,బీర బోయిన శారదా,బొగ్గా రవణ,బొగ్గా రమణమ్మ,బొగ్గా రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కిర్లంపూడి మండలంలో 350 ఎకరాలు నీట మునక.



**-మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి.**

**కిర్లంపూడి, పెన్ పవర్, ఆగస్టు 18:** కిర్లంపూడి మండలంలో విటివల కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లో 350 ఎకరాలు నీట మునిగినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి తెలిపారు. జగపతినగరం, కిర్లంపూడి, రామకృష్ణాపురం వేలంక గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో సుమారు 350 ఎకరాలు నీట మునిగేయన్నారు. నీట మునిగిన వరి పొలాలను తహసీల్దార్ జె చిరంజీవి పలువురు రివెన్యూ సిబ్బందితో కలసి పరిశీలించడం జరిగిందన్నారు. నీట మునిగిన వరి పొలాలను పరిశించి నివేదికను ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఆకుల సురేష్, వీఆర్వో సూర్య ప్రకాష్, గ్రామ వ్యవసాయ సహాయకులు రమ్య, మంజూష,మణికంఠ పలువురు రైతులు ఉన్నారు.

# కాపవరం కాలనీలో విరిగిపడ్డ పిట్టగోడ.

## రేకుల షెడ్డు పూర్తిగా కూలిపోయినా ఘటన.



**ఎటపాక ,పెన్ పవర్, ఆగస్టు 18 :**అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని కాపవరం గ్రామానికి చెందిన యన్నా. బాలు నివాస గృహం గత రాత్రి మూడు గంటల సమయంలో పిట్టగోడ కూలి రేకుల షెడ్డు పై పడటంతో రేకుల షెడ్డు పూర్తిగా కూలిపోయినా ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు ఇంటి పై స్లాబ్ పూర్తిగా తడిసిపోయి పిట్టగోడ బలహీనపడి గత రాత్రి రేకుల షెడ్డు పై విరిగిపడింది ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రమాదం వాటిల్లకుండా బయటపడ్డారు, ప్రభుత్వ వారు ఆదుకొని నూతన గృహ నిర్మాణానికి సహకరించాలని కుటుంబ సభ్యులు ప్రభుత్వ అధికారులు కోరుతున్నారు...

# పోలవరం ప్యాకేజీ తీసుకున్న భూములను ఆదివాసులకు పంచాలి



**కూనవరం,పెన్ పవర్,ఆగస్టు 18.**పోలవరం ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతంలో ప్రభుత్వ అధీనంలో ఉన్న ప్రభుత్వ ప్యాకేజి తీసుకున్న భూములను ఆదివాసులకే అప్పజెప్పాలని,ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ డిమాండ్ చేశారు.ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో వలస వచ్చిన గిరిజనేతరులకు భూమిపై ఎటువంటి హక్కులు లేకపోయినా,పరిహారం తీసుకుని ఆదే భూములను మైదాన ప్రాంత వాసులకు కౌలకు ఇచ్చుకుంటున్నారు.ఆ భూములను తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని స్థానిక ఆదివాసులకు పంచాలని డిమాండ్ చేసారు.వలస వచ్చిన గిరిజనేతరులకు ఏజెన్సీ ప్రాంతంలో ఓటరు నమోదు,రేషన్ కార్డులు,ఆధార్ కార్డులు మొదలైన గుర్తింపు పత్రాలు,సంక్షేమ పథకాలు ఇచ్చి తప్పు చేస్తుందని,ఇలా చెయ్యడం వలనే గురిజానేతరులకు మా ఆదివాసీలకు తరసు వివాదాలు జరుగుతున్నాయని ఈ వివాదాలకు ప్రభుత్వ అధికారులే కారణమని మండిపడ్డారు.ఏజెన్సీలో వారికి జారీ చేసిన గుర్తింపు పత్రాలు,సంక్షేమ పథకాలు వెంటనే వారివారి సొంత ప్రాంతాలకు బదిలీ చేయాలనీ డిమాండ్ చేసారు.

# డ్రైనేజీ లేక నీట మునిగిన మాణిక్యం ఇల్లు..

**పంచాయతీ అధికారుల నిర్లక్ష్యమే కారణమంటున్న గ్రామస్తులు..**



**ఎటపాక, పెన్ పవర్, ఆగస్టు 18 :**అల్లూరి జిల్లా ఎటపాక మండల పరిధిలోని గుండాల కాలనీ 9వ వార్డులో నివాసం ఉంటున్న గంపల మాణిక్యం నివాస గృహం డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి ఇబ్బంది పడుతున్న కుటుంబాన్ని సిపిఎం గుండాల శాఖ కార్యదర్శి తోట శ్రీను మరియు స్థానికుల సహాయంతో సురక్షితమైన ప్రాంతానికి కుటుంబ సభ్యులను తరలించారు, ఈ సమస్యని పంచాయితీ అధికారులు పరిష్కరించకపోతే గ్రామ సచివాలయం ముందు ధర్నా చేస్తామని సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో పిల్లం. రాజా బర్ల నాగరాజు ,కాగిత నాగరాజు, రవి ,ప్రతాప్ ,చందు తదితరులు పాల్గొన్నారు.

# బిళ్ళకుర్రు మహాదేవ దేవస్థానం పాలకవర్గ ప్రమాణ స్వీకారం





**కొత్తపేట,పెన్ పవర్, ఆగస్టు 18:**కొత్తపేట మండలం బిళ్ళకుర్రు గ్రామంలోని మహాదేవ దేవస్థానం పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం దేవస్థాన ప్రాంగణంలో ఘనంగా జరిగింది. గ్రామస్థాయి కూటమి నాయకులు, కార్యకర్తలు సమ్మతితో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సభ్యులను ఎంపిక చేసి అధికారికంగా ప్రమాణస్వీకారం జరిపించారు.ఈ సందర్భంగా నల్లం వెంకట శ్రీరామ మూర్తి (బాల), చోడే హరినాథ్, డేగల మంగాదేవి, రుద్ర వెంకటలక్ష్మి, బిల్లకుర్తి నాగేశ్వరరావు, మట్టపర్తి సత్యవతి, దంగేటి బాలరాజు, చావలి గోవిందా దీక్షితులు, కందికట్ల మంగాదేవి దేవస్థాన అధికారి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పాలకవర్గం ఏకగ్రీవ నిర్ణయంతో నల్లం వెంకట శ్రీరామ మూర్తి (బాల) ను చైర్మన్‌గా ఎన్నుకుంది.ఈకార్యక్రమంలో మాట్లాడిన టిడిపి నాయకులు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. బిళ్ళకుర్రు మహాదేవ దేవస్థానం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన ఆలయం కావడంతో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించడం, దేవస్థాన ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత పాటించడం వంటి అంశాల్లో పాలకవర్గం కృషి చేయాలని కోరారు.నూతన చైర్మన్ నల్లం వెంకట శ్రీరామ మూర్తి (బాల) మాట్లాడుతూ, గ్రామ పెద్దలు, గ్రామస్తులకి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధి కోసం పాలకవర్గం కృషి చేస్తుందని, భక్తుల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట మండల టిడిపి నాయకులు, గ్రామ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాడపల్లి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి దాతల విరాళాలు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 18:**కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ సన్నిధిలో నిర్మాణంలోఉన్న శ్రీ వకుళమాత అన్నదాన భవనానికి భక్తులు విరాళాలు సమర్పించారు.

ఏలూరు జిల్లా, భైరవపట్నం వాస్తవ్యులు గాదిరాజు నారాయణరాజు %-% అరుణ దంపతులు వారి కుటుంబ సభ్యులతో కలిసి రూ. 1,01,116 విరాళంగా సమర్పించారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా, పటమట వాస్తవ్యులు చి.శ్రీ కటకం నాగ వెంకట అంజనీ శివ శ్రీ లాస్య (డీ/ఓ శ్రీ వెంకట శేఖర్ – శాంతి దంపతులు) కుటుంబ సభ్యులతో కలిసి రూ. 50,116 విరాళాన్ని సమర్పించారు.దాతలను ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో ఆశీర్వదించగా, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఉప కమిషనర్ ఎం.ఎస్. సూర్య చక్రధరరావు ముదునూరి వెంకటరాజు, టిడిపి మండల అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు (బాబు) స్వామివారి చిత్రపటాన్ని బహుకరించి సత్కరించారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత-రాంబాబు



**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 17 :**పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు అన్నారు.మండలంలోని రాజ్యంపాలెం గ్రామంలో ఆదివారం జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమానికి మానవత సభ్యులు హాజరయ్యారు.గెడా పద్మ భాస్కర్ రావు దంపతుల మనవరాలు ప్రణవి ఓణీల కార్యక్రమానికి వీరు ప్రత్యేక అతిధులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి వచ్చిన బంధువులకు నిర్వాహకులు ఏర్పాటుచేసిన 400 పండూరి మామిడి మొక్కలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ నేటి సమాజంలో కొందరి స్వార్థపరుల స్వార్థం కారణంగా పచ్చని చెట్లు మోడు బారిపోతున్నాయన్నారు.దాని కారణంగా స్వచ్ఛమైన గాలి లేక వాతావరణం కలుషితం అయ్యి ప్రజలు రోగాల బారిన పడటంతో పాటు పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు.కాబట్టి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని భాస్కర్ రావు లాంటి దంపతులను ఆదర్శంగా తీసుకుని పచ్చని మొక్కలను పంపిణీ చేయడంతో పాటు వాటిని పెంచి పెద్ద చేయవలసిన అవసరం కూడా ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ కోశాధికారి గెడా జోగేంద్ర ప్రసాద్,ఉపాధ్యక్షులు ప్రకాష్,ఉండవల్లి రామకృష్ణ,జుజ్జవరపు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# అల్లూరి జిల్లా మహిళా ఫుట్‌బాల్ జట్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 18:**అల్లూరి సీతారామరాజు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ మహిళా జట్టు ఈ నెల 24, 25 తేదీల్లో నెల్లూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి ఇంటర్‌డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొనబోతోంది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పూనెం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ, మహిళల రాష్ట్రస్థాయి పోటీల్లో మన జిల్లా తరఫున జట్టుకు అవకాశం రావడం చాలా గర్వకారణం. ఆదివాసీ ఫుట్‌బాల్ ప్రతిభను వెలికితీసేందుకు మా అసోసియేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుంది అని తెలిపారు. అదేవిధంగా ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ అభినందనలు తెలియజేస్తూ, స్థానిక ప్రతిభను ఉపయోగించుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలకు ఎదగాలని మన విద్యార్థులందరికీ అవకాశాలు కల్పిస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ, ఏపిఓ, ఎకలవ్య పిడి ప్రిన్సిపాల్, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు రాజ్‌కుమార్, యాడమ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.



# వర్షం కారణంగా చిద్రంగా మారిన తెలికిచెర్ల రహదారి



**గోపాలపురం,పెన్ పవర్ ఆగస్టు 18:**కురుస్తున్న వర్షాలు రహదారులను చిద్రం చేస్తున్నాయి.పలుచోట్ల రహదారులు గోతులమయం కావడంతో కురుస్తున్న వర్షాలకు వాటిలో నీరు చేరి చిన్న సైజు చెరువులా దర్శనమిస్తున్నాయి.వర్షం నీరు పల్లపు ప్రాంతాలను జలమయం చేస్తున్నాయి.కొన్నిచోట్ల రహదారులు వర్షం నీటితో నిండి ఉండడంతో ఆ రహదారిపై ప్రయాణం వాహనదారులకు ప్రమాదకరంగా మారింది.బురద మయమైన రహదారిపై వెళ్ళే వాహనాలు బంద కారణంగా జారిపోవడం,వాహనదారులు ప్రమాదాల బారిన పడటం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.ముఖ్యంగా తెలికిచెర్ల గ్రామంలో ఉన్న ప్రధాన రహదారి పరిస్థితి అలాగే ఉంది.రహదారిపై గోతులు ఏర్పడడం వళ్ళ వర్షం నీటితో అవి నిండిపోతున్నాయి.కేవలం తెలికిచెర్ల పంచాయితీ కార్యాలయ సమీపంలో రహదారి అధ్వాన్నంగా తయారయింది.గతంలో కూడా ఇదే పరిస్థితి ఉంటే సర్పంచ్ బండి నాగరాజు,జనసేన నాయకుడు రుద్ర శ్రీను స్పందించి జెసిబి సహాయంతో గోతుల్లో నీరు బయటకు వెళ్లే ఏర్పాట్లు చేశారు.అయితే ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మళ్లీ గోతుల్లో నీరు చేరి ప్రమాద భరితంగా మారాయి.దీంతో



వాహనదారులు ఆ రహదారిపై ప్రయాణం చేయడానికి భయపడుతున్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చుడంతో పాటు రహదారి పైన వర్షం నీరు నిలువ ఉండకుండా చూడాలని వాహన చోదకులు,గ్రామస్తులు కోరుతున్నారు.

# శబరి గోదావరి వరదలను పరిశీలించిన ఐటిడిఏ పి.ఓ

# విద్యుత్ శాఖ హెచ్చరిక చింతూరు ప్రజలకు విజ్ఞప్తి



**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 18:**జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండగా, వరదల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని చింతూరు విద్యుత్ శాఖ విజ్ఞప్తి చేసింది. విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు సూచిస్తూ ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగి కిందపడినా, మంటలు వచ్చినా వెంటనే మాకు సమాచారం అందించాలి. ఇనుప స్తంభాలు, సిమెంట్ స్తంభాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టుకోరాదు అని తెలిపారు. ఎటువంటి సమస్య వచ్చినా వెంటనే కింది నంబర్లకు సమాచారమివ్వాలని విద్యుత్ శాఖ కోరింది:

8332988860, 8332988856, 9490369404, ప్రజల భద్రత కోసం జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని విద్యుత్ శాఖ చింతూరు విజ్ఞప్తి చేసింది.





**-లోతట్టు ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.**

**-వివిధ ప్రభుత్వ శాఖలకు సంబందించిన అధికారులు**

**-చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు,అధికారి అపూర్వ భరత్**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.18**

వి.ఆర్.పురం,కూనవరం మండలాలో చింతూరు ఐటిడిఏ ప్రాజెక్ట్,అధికారి అపూర్వ భరత్,చింతూరు అసిస్టెంట్ సూ పరిండెంట్,ఆఫ్ పోలీసు,వారు సోమవారం గోదావరి శబరి వరద పెరుగుతున్న కారణంగా లోతట్టు ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,మండలంలోని గ్రామాల్లో రహదా రులపై గోదావరి వరద రావడంతో అక్కడక్కడ రహదారి దిగ్బంధం కావడంతో సంబందిత అధికారులు రహదారుల ను పరిశీలించారు.రహదారులు దిగ్బంధం అయినచోట పోలీసు వారిని మండల రెవిన్యూ సంబధిత అధికారుల ను విధులు అక్కడే నిర్వహించాలని,చింతూరు పి.ఓ.ఆదే శాలు జారీ చేశారు.అనంతరం చింతూరు ఐటిడిఏ,పి.ఓ అపూర్వ భరత్,ప్రభుత్వ అధికారి ఏ.ఎస్.పి.కూనవరం బ్రిడ్జి వద్ద ఉన్న శబరి గోదావరి నదులను సందర్శించి,శబ రి ఉధృతంగా ప్రవహిస్తున్న వరదను పరిశీలించి,చింతూ రు,కూనవరం,వి.ఆర్.పురం మండలాలకు పెద్ద బోట్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని,తెలిపారు.వర్షకాలం సమయంలో ప్రజలు వాగులు దాటరాదు.చేపలు పట్టడం చేయరాదు.దీనికి సంబంధించి ఒక సర్క్యులర్ జారీ చేయడం జరుగుతుందని,అన్నారు.తదుపరి ప్రభుత్వ అధికారులు పి.ఓ.ఏ.ఎస్.పి.ఇరువురు అన్నవరం బ్రిడ్జి ను సందర్శించి,వర్షం ప్రభావం కారణంగా వాగు నీటి ఉధృతి చాలా ఎక్కువ ఉన్నదని,రాజుపేట,వడ్డిగూడెం గ్రామ ప్రజ లు ఉమ్మడివరం వైపు వ్యవసాయ కూలీ పనులకు వెళ్లి ఉమ్మడివరం వైపు ఆగిపోయిన ప్రజలకు భోజన సదుపా యం కల్పించాలని,వి.ఆర్.పురం తహశీల్దార్,వారికి ఆదే శించడం జరిగింది.వర్ష కాలంలో అన్నవరం వాగు దాటి కూలీ పనులకు వెళ్లడం మానుకోవాలని,వ్యవసాయ కూలీలను కోరారు.అనంతరం చింతూరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ అన్నవరం బ్రిడ్జి నిర్మాణానికి సం బంధించిన డిజైన్ మంజూరు ఉత్వరులు త్వరలోనే వస్తాయని,సెప్టెంబర్.అక్టోబర్.నెలలో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభం అవుతుందని,ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్,సరస్వతి,వి.ఆర్. పురం ఎస్.ఐ.సంతోష్,కుమార్,వివిద ప్రభుత్వ శాఖలకు సంబందించిన అధికారులు పోలీసు సిబ్బంది.తదితరులు పాల్గొన్నారు.



# శాస్త్రీయమైన సాంప్రదాయ వ్యవసాయ పండుగ తీజ్





**బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో**

**టీ నర్సాపురం, పెన్ పవర్, ఆగస్టు 18:** బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో నామవరంగ్రామంలో బంజారాల తీజ్ పండుగ ఘనంగానిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారాలు జరుపుకునే తీజ్ పండుగ శాస్త్రీయమైన సాంప్రదాయ వ్యవసాయ పండుగ అని అన్నారు. వెదురు బుట్టల్లో నవధాన్యాలు ఆడ బిడ్డలతో వేయించి, వాటిలో ఏ విత్తనం మొలకలు బాగా వస్తాయో ఆ పంటలు వేసుకునే ప్రయోగాత్మక వ్యవసాయ పండుగ అని అన్నారు. ఈ పద్దతిని కనిపెట్టిన బంజారా పూర్వీకులు తొలితరం గొప్ప వ్యవసాయ శాస్త్రవేత్తలు అని అన్నారు.సంఘ అధ్యక్షులు భూక్యా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారా ఆడబిడ్డలకు ప్రకృతి ప్రసాదించిన వరాల పండుగ తీజ్ అని, జీవితంలో వచ్చే కష్టాలను ఓర్చుకుంటూ, సహనంతో జీవించేలా, బాధల్లో ధైర్యంగా పోరాడాలనే బతుకు పాఠంను తీజ్ పండుగ నేర్పుతుందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న బంజారాలు ఈ తీజ్ పండుగను తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించుకుంటారని అన్నారు. పుట్టినిల్లు కీర్తిని మెట్టినిల్లు ప్రతిష్టను పెంచేలా చిన్నప్పటినుండి ఆడబిడ్డలకు నడవడికను నేర్పే పండుగ తీజ్ అని అన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి ప్రేమ్ చంద్ నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారాల తండాల్లో పాడిపంటలు మెండుగా ఉండాలని, సిరిసంపదలు నిండుగా ఉండాలని ఆడపిల్లలు కలలు కంటూ సాత్ భవానీల ఆశీస్సులు కోరుతూ చేసుకునే పండుగ తీజ్ అని అన్నారు.

తీజ్ బుట్టలను ఆడపిల్లలు ఎత్తుకొని తీన్మార్ డప్పులతో, సాంస్కృతిక బంజారా నృత్యాలతో ఊరంతా ఊరేగించుకుంటూ గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. నవరాత్రులు తీజ్ దీక్ష చేసిన ఆడబిడ్డలకు బంజారా భజరంగీ బేరి కమిటీ నాయకులు నూతన వస్త్రాలను బహుకరించారు.

ఈ కార్యక్రమంలో భూక్యా వేణుగోపాల్, ధరావత్ రవి, మూడు సోని, పుష్ప, లక్ష్మి, గ్రామ ఆడబిడ్డలు, వారి తల్లిదండ్రులు, కమిటీ నాయకులు, యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్న375 వజయంతి గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది .





**టీ.నర్సాపురం, పెన్ పవర్ ఆగస్టు 18 :**పాపన్నకు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.అనంతరం పాపన్న పుట్టినరోజు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా టీ నర్సాపురం టౌన్ గౌడ సంఘం అధ్యక్షులు మరీదు వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ 375 సంవత్సరాల క్రితమే బానిసత్వానికి వ్యతిరేకంగా పోరాడినటువంటి ఒక మహనీయుడు గౌడ కులంలో పుట్టటం గర్వకారణం అన్నారు. గౌడ్ జాతి పరక్రమ ప్రతిక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ, గౌడ్ జాతికే కాక బహుజన వర్గానికి వన్నెతెచ్చిన మొట్టమొదటి బహుజన సభవతి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని,10 మందితో గెరిల్లసైన్యంఏర్పాటు చేసిఅనతి కాలంలోనే 12 వేల సైన్యంతో ఔరంగజేబుపై తిరుగుబాటు చేసినటువంటి బహుజన చక్రవర్తి అని కొనియాడారు. గోల్కొండ కోటను ఏరిన మహారాజు పాపన్న గౌడ్ అని అన్నారు.దాదాపు తెలంగాణ ప్రాంతంలో 30 ఏళ్ల పాటు పరిపాలించి అనేక కోటలు నిర్మించాలనిపేర్కొన్నారు.ప్రస్తుతముశిధిలావస్థలో ఉన్న కోటలను
ప్రభుత్వాలుపునర్నిర్మించాలన్నారు.పాపన్నజయంతిఅధికారికంగా ఆంధ్రప్రదేశ్లోకూడాప్రకటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు వీరంకి పెద్ద సత్యనారాయణ, శ్యామకూరి,సత్యనారాయణ, పల్లగాని రాంబాబు, కాగితాల రాంబాబు, బైగాని చిన్నవెంకటేశ్వరరావు, పబ్బు జయరాజు, ఈడ నాగరాజు, చింతలపాటి మధు, పల్లగానిపోతురాజు, నూతి లక్ష్మీనారాయణ,
బై గాని రాటాలు, పర్సా శ్రీనివాసరావు, బై గాని సతీష్, గౌడ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి: పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు

**పాడేరు,పెన్ పవర్,ఆగస్టు 18:**గత రెండు రోజులుగా అల్పపీడనం ప్రభావంతో గిరిజన ప్రాంతాల్లో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పాడేరు శాసన సభ్యులు, వైసీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు తెలిపారు. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, వచ్చే రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వర్షాల ప్రభావంతో వాగులు పొంగిపొర్లి, కొన్ని బ్రిడ్జులు మరియు కల్వర్టులు కొట్టుకుపోయాయని, దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు. అత్యవసర ప్రయాణాలు తప్ప మరెక్కడికీ వెళ్లకుండా ఉండాలని, వెళ్లాల్సిన పరిస్థితుల్లో అన్ని జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు.

# గంజాయి సాగు నిర్మూలనపై అధికారులు దృష్టి పెట్టండి

**ఇంచార్జి పి ఓ, జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ**

**పాడేరు పెన్ పవర్,ఆగస్టు 18 :** మారు మూల అటవీ ప్రాంతాలలో గంజాయి సాగు చేయకుండా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి నిర్మూలనా చర్యలు చేపట్టాలని ఐటిడి ఏ ఇంచార్జి పి ఓ, జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ ఆదేశించారు. సోమవారం ఐటిడి ఏ కార్యాలయంలో అటవీ శాఖ వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, డి ఆర్ డి ఏ, ఐసిడి ఎస్, ఎస్ ఎం ఐ అధికారులతో గంజాయి నిర్మాలనా కార్య క్రమాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతం, అటవీ హక్కు పత్రాలు పంపిణీ చేసిన భూముల్లో గంజాయి సాగు చేయ కుండా ఎటువంటి పర్యవేక్షణ చేస్తున్నారని అటవీ శాఖ అధికారులను అడిగి తెలుసు కున్నారు. చెకోపోస్టుల వద్ద గంజాయి రవాణాను పకడ్బందీగా తనిఖీ చేయాలని సూచించారు. గ్రామైఖ్య సంఘాల సమావేశాలలో గంజాయి నిర్మూలనపై చర్చ జరగాలని చెప్పారు. గంజాయి సాగును విడిచి పెట్టిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలను అందించాలన్నారు. మండల స్థాయి సమావేశాలలో అధికారులు పాల్గొని మండల వ్యవసాయాధికారులు, ఉద్యాన గంజాయి



సాగు నివారణ ప్రక్రియపై చర్చించాలన్నారు. ఎరువులు, విత్తనాలు సకాలంలో పంపిణీ చేయాలని వ్యవసాయాధికారులకు సూచించారు. చెక్ డ్యాంల పరిధిలో గంజాయి సాగు చేయకుండా పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎన్ బి ఎస్ నంద్, డి ఆర్ డి ఏ పిడి వి.మురళి, ఐసిడి ఎస్ పిడి ఝాన్సీ లక్ష్మి, ఎస్ ఎం ఐ డి ఇ నాగేశ్వరరావు, ఉద్యాన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల నేపథ్యంలో ప్రజలకు చింతూరు పోలీసుల హెచ్చరిక



**చింతూరు, పెన్ పవర్, ఆగస్టు 18:**జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు పొంగిప్రవహించే అవకాశం ఉందని చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ చ. గోపాలకృష్ణ తెలిపారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు దాటకూడదని, చేపలు పట్టకూడదని ఆయన సూచించారు. కొండవాగులు తీవ్ర ఉధృతితో ప్రవహిస్తున్నందున వాగుల ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరించారు. మోతుగూడెం పర్యాటక ప్రాంతాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాత్కాలికంగా మూసివేయడం జరిగిందని, పర్యాటకులు ఈ విషయాన్ని గమనించాలని తెలిపారు. అలాగే మారేడుమిల్లి భద్రాచలం ఘాట్ రోడ్డులో అవసరం లేని ప్రయాణాలు మానుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రయాణించాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఆరోగ్య పరిరక్షణ చర్యలు తీసుకొని సురక్షితంగా ఉండాలని ప్రజలను ఆయన కోరారు.

సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు

సిఐ 9281442982

ఎస్ఐ 9182609596

చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్

శ్రీ చ. గోపాలకృష్ణ

# వ్యవసాయ వరినట్లు కూలీ పనులకు వెళ్లరాదు

- **లోతట్టు ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.**
- **వి.ఆర్.పురం ఎస్.ఐ.సంతోష,కుమార్,పోలీసు సిబ్బంది.**

**వి.ఆర్.పురం పెన్.పవర్.ఆగస్టు.18:**మండలంలోని వి.ఆర్.పురం,వడ్డిగూడెం,రేఖపల్లి, రాజుపేట కాలనీ,తదితర గ్రామాల ప్రజలు అన్నవరం వాగు దాటి వ్యవసాయ వరినట్లు కూలీ పనులకు వెళ్లవద్దని,మంగళవారం కూడా అధిక వర్షపాతం నమోదు అయిందని,లోతట్టు ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,వి.ఆర్.పురం ఎస్.ఐ.సంతోష,కుమార్,పోలీసు సిబ్బంది.ప్రకటనలో కోరారు.



## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండండి




జీకే వీధి ఎస్ఐ కె.అప్పలసూరి

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, ఆగస్టు 18:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పోలీస్ శాఖ హెచ్చరిస్తోంది. వర్షాల కారణంగా వాగులు పొంగే అవకాశం ఉన్నందున, ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు, నీటి ప్రవాహాలు దాటవద్దని జీకే వీధి ఎస్ఐ కె.అప్పలసూరి విజ్ఞప్తి చేశారు.వర్షాలకు మట్టితో నిర్మించిన పాడుబడిన మిద్దె ఇళ్లలో నివసించే వారు వెంటనే సురక్షితమైన ప్రాంతాలకు తరలిపోవాలని కోరుతున్నారు.ఇది వారి ప్రాణాలకు ప్రమాదం కలిగించే అవకాశం ఉన్నందున జాగ్రత్త వహించాలని సూచించారు. అలాగే వర్షాల కారణంగా రోడ్లపై చెట్లు పడిన, లేదా కరెంటు స్తంభాలపై చెట్లు పడిన ఘటనలు ఎక్కడైనా చోటు చేసుకున్నచో, స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెంటనే సమాచారం అందించాల్సిందిగా ప్రజలను కోరారు. వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తూ ఎస్సై అప్పలసూరి ప్రకటన విడుదల చేశారు.

## జీకే వీధి మండలంలో భారీ వర్షాలపై ప్రజలకు తహసీల్దార్ హెచ్చరిక

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు18:**అల్లూరి సీతారామరాజు జిల్లాలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జీకే వీధి మండల పరిధిలోని గ్రామాలలో రాబోయే మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని జీకే వీధి తహసిల్దార్ హెచ్.అన్నాజీ రావు ఒక ప్రకటనలో తెలిపారు.అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నేపథ్యంలో మండల తహసీల్దార్ హెచ్.అన్నాజీ రావు ఒక ప్రకటనలో ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల కారణంగా గెడ్డలు, వాగులు పొంగి పొర్లే అవకాశం ఉండటంతో ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటేందుకు సాహసం చేయరాదని హెచ్చరించారు. గ్రామాలలో ఎక్కడైనా వర్షం కారణంగా చెట్లు రోడ్డుపై విరిగిపడటం, విద్యుత్ స్తంభాలపై చెట్లు పడటం, కొండచరియలు విరగడం వంటి ఘటనలు జరిగితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా తహసీల్దార్ కార్యాలయానికి తక్షణమే తెలియజేయాలని, గ్రామస్థాయి అధికారులతో సంప్రదింపులు జరుపుతూ స్థానిక పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమీక్ష జరుగుతోందని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు ముంపు ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో ఎదురైన అనుభవాలను గుర్తు చేసుకుంటూ ఈసారి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, అవసరమైన సహాయాన్ని ప్రజలకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తహసీల్దార్ వెల్లడించారు.




## భారీ వర్షాల నేపథ్యంలో అధికారులను అప్రమత్తం చేసిన ఎంపీడీవో



- వర్షాలు నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఆగస్టు 18:** బంగాళఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు గాను జిల్లా కలెక్టర్,జెసి ఆదేశాల మేరకు గూడెం కొత్త వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు అధికారులను అప్రమత్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు సచివాలయం సిబ్బంది పంచాయతీ కేంద్రాలలో ఉంటూ భారీ వర్షాల దృష్ట్యా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలని తెలిపారు. గ్రామాలలో వర్షాల వల్ల ఏర్పడిన నష్టాన్ని అనగా రోడ్లు, వంతెనలు కొట్టుకుపోవడం, పొలాలు మునిగిపోవడం, గృహాలు కూలటం వంటి వాటిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారాన్ని చేరవేయాలని ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలని ఎంపీడీవో ఆదేశించారు.



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్టు 18:**గత రెండు రోజులుగా అల్పపీడనం ప్రభావంతో గిరిజన ప్రాంతాల్లో ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండల పేసా అధ్యక్షులు కొర్ర బలరాం తెలిపారు. సోమవారం మండల పేసా ప్రధాన కార్యదర్శి మాదిరి చంటిబాబుతో కలిసి ఒక ప్రకటన విడుదల చేశారు. వాతావరణ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, వచ్చే రెండు రోజులు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వర్షాల ప్రభావంతో వాగులు పొంగిపొర్లి, కొన్ని బ్రిడ్జులు మరియు కల్వర్టులు కొట్టుకుపోయాయని, దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని ఆయన పేర్కొన్నారు.అత్యవసర ప్రయాణాలు తప్ప మరెక్కడికీ వెళ్లకుండా ఉండాలని, వెళ్లాల్సిన పరిస్థితుల్లో అన్ని జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఎటువంటి అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. అలాగే అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ కారణంగా అత్యవసర పరిస్థితిలో ప్రజలను ఆదుకోవడానికి పేసా సభ్యులు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## భారీ వర్షాలు కొనసాగుతున్నాయి - ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:

**జనసేన పార్టీ నాయకులు గొర్లె వీర వెంకట్**



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ , ఆగస్టు 18:** గత రెండు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. రహదారులపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, రాబోయే 24 గంటల్లో కూడా కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లే వీర వెంకట్ తెలిపారు.ముఖ్యంగా, విద్యుత్ తీగలు తెగిన ప్రాంతాలు, నీటిమట్టం పెరిగిన వంతెనలు, చెరువులు, వాగులు దరిదాపులలోకి వెళ్లవద్దని హెచ్చరికచేశారు. అత్యవసరమైతేనే తప్ప ఇంటి నుండి బయటకు రావద్దని, ముఖ్యంగా వృద్ధులు చిన్నారులు గర్భిణీలు తగిన జాగ్రత్తగా పాటించాలని సూచించారు. కాలువలు పొంగిపొర్లుతూ ఉండటంతో వాటిని దాటే ప్రయత్నం చేయవద్దని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, ఉద్యోగులకు ప్రయాణంలో జాగ్రత్తలు అవసరమని అన్నారు.ప్రజలంతా అప్రమత్తంగా ఉండి, ప్రభుత్వ సూచనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## మొండెంఖల్ కేంద్రంగా నూతన మండలం ఏర్పాటు చేయాలి ...

- ట్రైబల్ రైట్స్ ఫోరం (టీ.ఆర్.ఎఫ్)
- జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణారావు

**కురుపాం, పెన్ పవర్, ఆగస్టు -18:** రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలు, మండలాల ఏర్పాటు సరిహద్దులు మార్చడం కొరకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం తూర్పు ముఠా ప్రాంతానికి చెందిన ఆదివాసులు మండల కేంద్రానికి రావాలంటే సుమారుగా 50 నుంచి 60 కిలోమీటర్లు దూరం ప్రయాణం చేయవలసి ఉంటుంది. తూర్పు ముఠా ప్రాంతంలో 11 గ్రామపంచాయతీలకు

కేంద్రమైన మొండెంఖల్లు కేంద్రంగా నూతన నూతన మండలం ఏర్పాటు చేస్తారని కోరుచు జిల్లా కలెక్టర్ గారికి సోమవారం గ్రీవెన్స్ లో వినతిపత్రం అందజేశారు.

గతంలో మెండెంఖల్లు గ్రామం తాలూక గా ఉండేదని,

ఈ ప్రాంతంలో ఎక్కువగా పి.వి. టి.జి ఆదివాసులు ఎక్కువగా నివాసం ఉంటున్నారని

నూతన మండలం ఏర్పాటు చేసినట్లయితే పరిపాలన పరంగా



అందరికీ అందుబాటులో ఉంటుందని తెలియజేసారు.

ఈ ప్రాంతాల్లో 11 గ్రామపంచాయతీలు సుమారు 15 వేల పైగా జనాభా కలిగి ఉన్నారు.

ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు,

ఆదివాసి జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అసిస్టెంట్ సెక్రెటరీ దుక్క సీతారం,గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్లా సురేష్,గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షులు ఆరిక చంద్రశేఖర్ లు పాల్గొన్నారు.

## మృతి చెందిన కార్మికుల కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలి..







**ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు డిమాండ్**

**మృతుల ఫోటోల తో కలక్టరేట్ వద్ద ధర్నా ..**

**కురుపాం/ పార్వతీపురం, పెన్ పవర్, ఆగస్టు-18,** మున్సిపల్ ఆప్కాస్ విధానంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తూ అకస్మాత్తుగా మృతి చెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాడు సిఐటియు ఆధ్వర్యంలో కలక్టర్ కార్యాలయం వద్ద మృతి చెందిన కార్మికుల ఫోటోలతో వారి కుటుంబ సభ్యులు యూనియన్, సిఐటియు నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం జిల్లా కలక్టర్ శ్యాం ప్రసాదుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.వై.నాయుడు మాట్లాడుతూ ఈ సమస్య రెండు సంవత్సరాలుగా ఉందని, ఇప్పటికే ఈ జీఓ 25 ప్రకారంగా రాష్ట్ర వ్యాప్త అన్నీ మున్సిపాలిటీలలో కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించారని, అందులో భాగంగా మన మన్యం జిల్లాలో కూడా పాలకొండ, సాలూరు ప్రాంతాలలో ఉద్యోగ కల్పన జరిగిందని, కానీ పార్వతీపురం మున్సిపాలిటీలో జీవో అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. ఇది కేవలం కుట్రలలో భాగంగా భావించాల్సి వస్తుందని విమర్శించారు. జీవో నెంబర్ 25 ను పటిష్టంగా అమలు చేసి కార్మికుల కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలని, రాత్రి వేళల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎలాంటి రక్షణ లేదని రాత్రి వేళల్లో కాకుండా పగలు విధులు నిర్వహించే విధంగా మార్పు చేయాలని, యోగాంధ్ర కార్యక్రమంలో పనిచేసిన కార్మికులకు టిఏ, డిఏలు ఇవ్వాలని, మున్సిపల్ వాహనాలు నడుపుతున్న సీనియర్ వర్కర్లను డ్రైవర్లుగా గుర్తించాలని, మున్సిపల్ వర్కర్లకు అధికారులు వేధింపులు లేకుండా చూడాలని, ఈ సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తు పోరాటాలకు కార్యక్రమం చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, పట్టణ కార్యదర్శి బి.సూరిబాబు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ సింహాచలం, ఎన్.శంకర్రావు, బి.బాలు, టి.భానుప్రసాద్, కె.రాంబాబు, ఎస్.వినయ్ కుమార్, జె.లక్ష్మి, ఎం.మహేంద్ర, బి.నాగమణి మరియు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారికి అధిష్టానం మంచి గుర్తింపునిస్తుందని





- బాబు షూరిటీ మోసం గ్యారంటీ" క్షేత్రస్థాయిలో జరగాలి
- ప్రతి గడపకు వెళ్ళి ప్రజలను చైతన్య పరచాలి
- 31వ తేదీలోగా వార్డు, బూతు స్థాయి కమిటీలు పూర్తి కావాలి
- దక్షిణ సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఆగస్టు 18 :**మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ దక్షిణ వైసీపీ రథసార దులతోసమన్వయ కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఆసీలమెట్ట కార్యాలయంలో సోమవారం ఉదయం కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. “బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం” పై పలు సూచనలు ప్రణాళికలు చేశారు. క్షేత్రస్థాయిలో ఈ కార్యక్ర మాన్ని తీసుకువెళ్లాలని, ప్రతి గడపను టచ్ చేసి ప్రజలను చైతన్య పరచాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఫెయిల్యూర్ పాలన, బాబు చేస్తున్న మోసాలను ఎండగట్టాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలన్న పేద ప్రజలు సంతోషంగా ఉండాలంటే మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాల న్నారు. దానికోసం వైఎస్ఆర్సిపి కుటుంబ సభ్యులందరూ కష్టపడాలని సూచించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారికి అధిష్టానం మంచి గుర్తింపునిస్తుందని తెలిపారు. వార్డు స్థాయి, బూతు స్థాయిలలో కమిటీని వేసి ఈ నెల 31వ తేదీ లోపు దక్షిణ కార్యాలయంలో సమర్పించాలనీ సూచించారు. వాటిని అధిష్టా నంకి పంపిస్తామని తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలను మభ్యపెడుతూ రాష్ట్రాన్ని అంధకారంలో నెట్టుతున్న చంద్రబా బు నారా లోకేష్ పవన్ కళ్యాణ్ విధివిధానాల ను తిప్పి కొట్టాలన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు దక్షిణ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జి.కె.వీధి మండలంలో భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన

**సంకాడ జనసేన పార్టీ అధ్యక్షులు ఊలం ఈశ్వర్ రావు**

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఆగస్ట్ 18:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 18 మరియు 19 తేదీలలో అల్లూరి సీతారామరాజు జిల్లా, జి.కె.వీధి మండలంలో మోస్తారు నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని సంకాడ పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు ఊలం ఈశ్వరరావు హెచ్చరించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వర్షపు వేళలు ఇంటి లోపలే ఉండాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకూడదని ఆయన సూచించారు.చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ వైర్లు తాకరాదని ప్రజలకు సూచించారు. అలాగే చెట్ల క్రింద మరియు పాడైన భవనాల్లో ఉండకూడదని స్పష్టం చేశారు. వర్షాల వల్ల పొంగి ప్రవహించే వాగులు, వంకలలో దాటి వెళ్లే ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరించారు.ఎటువంటి ప్రమాదం జరిగినా వెంటనే ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండి స్వీయ రక్షణ కోసం తగిన జాగ్రత్తలు పాటించాలని విజ్ఞప్తి చేశారు.



# విశాఖ ఉక్కు.. మరింత చిక్కు.. తాజా డెసిషన్ ..!




**హైదరాబాద్  పెన్ పవర్:** విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో మరో పెద్ద చిక్కు తెరమీదికి వచ్చింది. ఈ ప్లాంటును ప్రైవేటీకరించ వద్దని.. కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు మూడేళ్లుగా ఉద్యమాలు చేస్తున్నాయి. అయితే.. వీరు ఆశిస్తున్నట్టుగా క్షేత్రస్థాయిలో ఏమీ జరగడం లేదు. పైగా.. ఎప్పటికప్పుడు.. ప్రైవేటీకరణ అంశం తెరమీదకి వస్తూనే ఉంది. దీనిని ప్రైవేటీకరించకుండా.. తాము అడ్డు పడతామని కూటమి నాయకులు, మంత్రి నారాలోకేష్ ప్రకటించారు.కానీ, వారు చెబుతున్న మాటలకు భిన్నంగా క్షేత్రస్థాయిలో పనులు జరుగుతున్నాయి. తాజాగా విశాఖ స్టీల్ ప్లాంటుకు సంబంధించి ఏకంగా 34 విభాగాలను ప్రైవేటీకరించేందుకు.. కేంద్ర ఉక్కు మంత్రి త్వ శాఖ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో విశాఖ ఉక్కు అధికారులు వీటికి సంబంధించిన నోటిఫికేషన్ ఇచ్చేశారు. అంటే.. తాంబూలాలిచ్చేశాం.. అన్నట్టుగా వ్యవహరించారు. వీటిలో కీలకమైన గనులు కూడా ఉన్నాయి. వాస్తవానికి గనులు లేకపోతే.. విశాఖ ఉక్కు ముందుకు నడిచే పరిస్థితిలేదు. దీనిపైనే కార్మికులు కొన్ని దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. అలాంటిది ఇప్పుడు 34 విభాగాల్లో కీలకమైన మైనింగ్‌లు ఉండడంతోపాటు.. బ్లాస్ట్ ఫర్నేజ్-1, 2, 3లను కూడా ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్ ఇచ్చేశారు. ఈ పరిణామాలు.. మరింతగా కూటమి సర్కారుకు ఇబ్బందులు తెస్తున్నారు. కార్మిక సంఘాలు సహా.. ఉద్యోగులు కూడా ఈ వ్యవహారంపై తీవ్రస్థాయిలో మండి పడుతున్నారు. ఇదేం పద్ధతని ప్రశ్నిస్తున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేది లేదని అంటూనే.. ఇలా నోటిఫికేషన్లు ఇవ్వడం ఏంటన్నది వారి నిలదీత.ఇదిలావుంటే.. ప్రస్తుతం ఢిల్లీ వెళ్లిన.. మంత్రి నారా లోకేష్.. ఈ వ్యవహారాన్న ప్రస్తావించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఒకవేళ ప్రైవేటీకరించాలని అనుకుంటే.. నేరుగా చెప్పాలని.. కూడా కార్మిక సంఘాలు పట్టుబడుతున్నాయి. ఇది కూటమి నాయకులకు, స్థానిక ఎంపీ భరత్‌కు కూడా ఇబ్బందిగా మారింది. మరోవైపు.. ఈ కేసు హైకోర్టులో విచారణ పరిధిలో ఉంది. ఈ ఏడాది నవంబరులో దీనిపై మరోసారి విచారణ జరగనుంది. ఈ విషయాన్ని కూడా కార్మికులు ప్రస్తావిస్తున్నారు. హైకోర్టులో ఉండగానే ఇలా ప్రైవేటీకరణకు నిర్ణయం తీసుకోవడం ఏంటన్నది వారు చెబుతున్న మాట. ఏదేమైనా.. ఇది ముందు ముంద ఇబ్బందిగానే మారనుందన్న సంకేతాలు వస్తున్నాయి.

# ఇంటెల్-మైక్రోసాఫ్ట్ లీక్ : కార్పొరేట్ గోప్యత ఒక సవాల్




**హైదరాబాద్  పెన్ పవర్:** అమెరికా టెక్ ప్రపంచంలో సంచలనం సృష్టించిన ఇంటెల్-మైక్రోసాఫ్ట్ లీక్ కేసులో భారతీయ మూలాలున్న ఇంజనీర్ వరుణ్ గుప్తా జీవితం అనూహ్యంగా మారిపోయింది. కంపెనీ గోప్యాంశాలను దొంగిలించినందుకు న్యాయస్థానం అతనికి జైలు శిక్ష నుంచి మినహాయింపునిచ్చి భారీ జరిమానా విధించింది. ఇది కేవలం ఒక వ్యక్తి చేసిన పొరపాటు మాత్రమే కాదు, కార్పొరేట్ ప్రపంచానికి ఒక పెద్ద హెచ్చరిక.

**ఏంటి ఆ కేసు?**

వరుణ్ గుప్తా దాదాపు పదేళ్ల పాటు ఇంటెల్‌లో ప్రొడక్ట్ మార్కెటింగ్ ఇంజనీర్గా పనిచేశాడు. 2020లో మైక్రోసాఫ్ట్‌లో చేరడానికి ముందు, ఇంటెల్‌కి చెందిన అనేక కీలకమైన రహస్య డాక్యుమెంట్లు, ధరల వ్యూహాలు, క్లయింట్ ప్రాజెక్టులు, వ్యాపార ప్రణాళికలను కాపీ చేశాడు. ఇవి ప్రత్యర్థి కంపెనీలకు ప్రయోజనం చేకూర్చే అంతటి సున్నితమైన సమాచారం. ఈ చర్యను గుర్తించిన ఇంటెల్, వెంటనే కోర్టులో కేసు వేసింది.

**కోర్టు తీర్పు**

అమెరికా అటార్నీ వాదన ప్రకారం, గుప్తా ఉద్దేశపూర్వకంగా ఈ గోప్యాంశాలను దొంగిలించినందుకు కనీసం ఎనిమిది నెలల జైలు శిక్ష తప్పదని పేర్కొన్నారు. అయితే, గుప్తా తరపు న్యాయవాదులు దానిని “తప్పిద నిర్ణయం”గా వాదించారు. ఈ వాదోపవాదాలు విన్న కోర్టు చివరకు గుప్తాకు జైలు శిక్ష విధించకుండా, సుమారు $34,472 (30 లక్షలు) జరిమానా , రెండేళ్ల పాటు ప్రొబేషన్ శిక్షను విధించింది.

**టెక్ నుండి వైన్‌కు మార్పు**

ఈ కేసు తర్వాత వరుణ్ గుప్తా తన కెరీర్‌ను పూర్తిగా మార్చుకున్నాడు. సెమీకండక్టర్ ప్రపంచాన్ని వదిలి, ఫ్రాన్స్‌కు వెళ్లి వైన్ తయారీ (వైనార్డ్స్) నిర్వహణపై విద్యను అభ్యసించడం ప్రారంభించాడు. ఇప్పుడు అతని లక్ష్యం వైన్ పరిశ్రమలో ఒక టెక్నికల్ డైరెక్టర్‌గా స్థిరపడటం.

ఈ సంఘటన ఒక వ్యక్తి జీవితంలో జరిగిన పెద్ద పాఠం. కార్పొరేట్ గోప్యతను ఉల్లంఘిస్తే ఎలాంటి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయో ఈ కేసు స్పష్టం చేసింది. అయితే, ఒక తప్పు తర్వాత జీవితాన్ని కొత్తగా ప్రారంభించవచ్చని, కొత్త దిశగా మలుచుకోవచ్చని వరుణ్ గుప్తా నిరూపించాడు. ఇది కార్పొరేట్ ప్రపంచంలోని ఉద్యోగులకు ఒక గట్టి హెచ్చరిక. అదే సమయంలో, జీవితంలో ఎదురైన అడ్డంకులను అధిగమించి, కొత్త దారిని ఎలా ఎంచుకోవాలో చెప్పే స్ఫూర్తిదాయకమైన కథ కూడా

# టీడీపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవాల్సిందేనా ?



**హైదరాబాద్  పెన్ పవర్:** టీడీపీ అంటేనే క్రమశిక్షణకు మారు పేరుగా ఉన్న పార్టీ. ఆ పార్టీకి ఒక విధానం ఉంటుంది. కట్టు తప్పిన వారి విషయంలో ఉపేక్షించిన దాఖలాలు అయితే లేవు. గతంలో అయితే ఎవరైనా గీత దాటితే ఎన్టీఆర్ వెంటనే వేటు వేసేవారు చంద్రబాబు జమానాలో అయితే అది కాస్తా మారింది. క్రమశిక్షణా సంఘం ముందు వారిని హాజరు పరచడం, వారి విషయంలో వివరణ తీసుకోవడం వంటివి చేస్తూ తుది హెచ్చరికలు జారీ చేసేవారు. ఇక బాబు హయాంలో టీడీపీ నుంచి సస్పెన్షన్లు బహు తక్కువ. అలా పరిస్థితి ముదరకుండా ముందే జాగ్రత్త పడేవారు.

**గతం అలా ఇపుడిలా :**

ఇక చంద్రబాబు మాట అంటే టీడీపీలో శిలా శాసనం గా ఉండేది. ఆయన వద్ద ఎవరైనా భయపడాల్సిందే. బాబు ఒకటి రెండు సార్లు చెబుతారు. ముందే సీరియస్ అవరు, కానీ ఆ ఇచ్చిన సమయాన్ని అవకాశాన్ని వాడుకోకపోతే మాత్రం ఎంతటి వారికైనా శిక్ష తప్పదని హెచ్చరికగా ఉండేది. కానీ ఇదంతా గతంగా మారుతోంది. టీడీపీలో బాబు మాటను జవ దాటుతున్న వారు పెరుగుతున్నారు. కట్టు తప్పుతున్నారు. చాలా మంది ఎంతలా చెప్పినా తమకు తోచిన విధంగా చేసుకుని పోతున్నారు. చివరికి ఇవే తలనొప్పులుగా మారుతున్నాయి.

**మంచి పనులు మరుగున :**

ఒక వైపు ఎన్ని ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అలాగే అభివృద్ధి అజెండాను ముందు పెట్టుకుని అడుగులు వేస్తోంది. అయితే ఇవి జనంలో చర్చకు పెట్టడం కనా కొంతమంది ఎమ్మెల్యేల వ్యవహారమే హైలెట్ అవుతోంది వారు చేస్తున్న పనులే జనంలోకి చర్చకు వస్తున్నాయి. ఆ తరహా ఎమ్మెల్యేలు అధికారం ఉంది కదా అని దూకుడుగా ఉంటున్నారు. దాంతో చెడ్డ పేరు పార్టీకి ప్రభుత్వానికి కూడా వస్తోంది అంటున్నారు. సుపరిపాలనలో తొలి అడుగు అని ప్రభుత్వం ఎంతగా ప్రచారం చేసుకున్నా దానిని మించి ఎమంలెయేలు కొందరు చేస్తున్న వ్యవహారాలే చర్చకు వస్తున్నాయంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు. ఆయా ఎమ్మెల్యేలు చేసే పనులే వైరల్ అవుతున్నాయి అని అంటున్నారు.

**వారి విషయం సీరియస్ గానే :**

ఇక టీడీపీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు మూడు ప్రాంతాలకు చెందిన వారి మీద వచ్చిన ఆరోపణలు కానీ విమర్శలు కానీ ఈ సండెని రాజకీయంగా మండించేశాయి. ఎక్కడ చూసినా వీటి మీదనే చర్చ సాగుతూ వస్తోంది. అనంతపురం ఎమ్మెల్యే కానీ అలాగ గుంటూరులో ఉన్న మరో ఎమ్మెల్యే కానీ ఇక ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇంకో ఎమ్మెల్యే కానీ వీరి విషయంలో అధినాయకత్వం సీరియస్ గా ఉంది అని అంటున్నారు. వీరి మీద వచ్చిన ఆరోపణల పైన హై కమాండ్ గట్టిగానే రియాక్ట్ అవుతోంది. దీంతో వీరి విషయంలో నివేదికలను పార్టీ పెద్దలు కోరుతున్నారని అంటున్నారు.

**యాక్షన్ తప్పదా :**

వివాదాలు లేదా అవినీతి ఆరోపణలు లేదా దాష్టికాలు ఇలా కొందరు ఎమ్మెల్యేలు వార్తలలో ఉంటూ వస్తున్నారు. వారి వల్లనే చెడ్డ పేరు వస్తోంది అని హైకమాండ్ కూడా అర్థం చేసుకుంది అందుకే ఈసారి సీరియస్ గానే యాక్షన్ ఉంటుందా అన్నది చర్చగా ఉన్నది. కొంతమంది మీద అయినా యాక్షన్ తీసుకుంటే

మిగిలిన వారు దారిలోకి వస్తారు అన్న మాట కూడా ఉంది. టీడీపీకి ఎమ్మెల్యేలు ఏకంగా 135 మంది దాకా ఉన్నారు. ఒకరిద్దరు విషయంలో సీరియస్ గా చర్యలు తీసుకున్నా పోయేది ఏమీ లేదు అన్న మాట కూడా ఉంది.

అందుకే ఒకరిద్దరి విషయంలో సస్పెన్షన్ వేటుకు అయినా సిద్ధపడితే మొత్తం పార్టీ దారికి వస్తుంది అని అంటున్నారు. లేకపోతే మొత్తంగా నష్టపోయే ప్రమాదం ఉంది అని అంటున్నారు. ఇక క్రమశిక్షణ కలిగిన పార్టీ అని టీడీపీ రుజువు చేసుకోవాలీ అంటే గట్టి చర్యలు తీసుకోకతప్పదని సూచనలు అయితే వస్తున్నారు. మరి ఒకరిద్దరి విషయంలో చర్యలు తప్పవా అంటే ఏమో వేచి చూడాల్సిందే అంటున్నారు.

# జీఎస్టీ 2.0: సామాన్య ప్రజలకు డబుల్ ధమాకా!




**హైదరాబాద్  పెన్ పవర్:** భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రధాని నరేంద్ర మోదీ, దేశ ప్రజలకు ఒక గొప్ప శుభవార్తను అందించారు. ఈ దీపావళికి దేశానికి “డబుల్ ధమాకా” అందిస్తామని ప్రకటించారు. అందులో అత్యంత ముఖ్యమైనది, సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు, మధ్య తరహా పరిశ్రమలకు భారీగా ఊరటనిచ్చే జీఎస్టీ 2.0 సంస్కరణలు. ఈ సంస్కరణలు దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలకనున్నాయి.

**జీఎస్టీ 2.0లో కీలక మార్పులు**

ప్రస్తుతం, జీఎస్టీలో 0%, 5%, 12%, 18%, 28% అనే ఐదు స్లాబ్‌లు ఉన్నాయి. వీటికి అదనంగా కొన్ని విలాసవంతమైన వస్తువులపై కంపెన్సేషన్ సెస్ కూడా ఉంది. అయితే, కొత్త సంస్కరణల్లో ఈ నిర్మాణంలో గణనీయమైన మార్పులు రాబోతున్నాయి. 12% స్లాబ్‌ను పూర్తిగా రద్దు చేసి, అందులోని వస్తువులను 5% లేదా 18% స్లాబ్‌లలోకి మార్చనున్నారు. ముఖ్యంగా, 12% స్లాబ్‌లోని 99% వస్తువులను 5% స్లాబ్‌లోకి మార్చే అవకాశం ఉంది. అత్యధిక పన్ను రేటు అయిన 28% స్లాబ్‌లోని 90% వస్తువులు 18% స్లాబ్‌లోకి రానున్నాయి. దీని వల్ల అనేక గృహోపకరణాలు, ఇతర వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయి. విలాసవంతమైన, హానికరమైన వస్తువులపై ప్రస్తుతం ఉన్న సెస్‌కు బదులుగా 40% ఏకరీతి రేటును విధించాలని ప్రతిపాదించారు. ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (%×ుజ%) సమస్యలు, రిఫండ్ ప్రక్రియలను మరింత సులభతరం చేయనున్నారు, ఇది చిన్న వ్యాపారులకు గొప్ప ఉపశమనం.

**ఏ వస్తువుల ధరలు తగ్గుతాయి?**

జీఎస్టీ రేట్ల తగ్గింపుతో కొన్ని ముఖ్యమైన వస్తువుల ధరలు తగ్గుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. గృహోపకరణాలు అయిన ఫ్రిజ్, ఎయిర్ కండీషనర్లు, వాషింగ్ మెషీన్‌లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువుల ధరలు 28% నుంచి 18% స్లాబ్‌లోకి మారడం వల్ల తగ్గే అవకాశం ఉంది. ఆహార ఉత్పత్తులు అయిన ఫ్రూట్ జ్యూస్‌లు, బటర్, చీజ్, కండెన్స్‌డ్ మిల్క్, డ్రై ఫ్రూట్స్, సాసేజ్‌ల వంటి వాటి ధరలు తగ్గుతాయి. ఆరోగ్య సంబంధిత ఉత్పత్తులు మెడికల్ గ్రేడ్ ఆక్సిజన్, గాజ్, బ్యాండేజ్‌లు, డయాగ్నస్టిక్ కిట్‌లు వంటి వైద్య ఉత్పత్తుల ధరలు తగ్గడం వల్ల ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గుతాయి. బీమా సేవలు అయిన ఆరోగ్య, జీవన బీమా ప్రీమియంలపై జీఎస్టీ 18% నుంచి 12% లేదా 5%కి తగ్గవచ్చు, ఇది మధ్యతరగతి వారికి పెద్ద ఊరట. ఎఫ్‌ఎంసీజీ ఉత్పత్తులు అయిన చిన్న ప్యాకెట్లలో లభించే షాంపూలు, సబ్బుల వంటి రోజువారీ అవసరాల ధరలు తగ్గుతాయి.

**ఆర్థిక వ్యవస్థపై ప్రభావం**

ఈ సంస్కరణల వల్ల ఆర్థిక వ్యవస్థపై అనేక సానుకూల ప్రభావాలు ఉండనున్నాయి. సామాన్య ప్రజలకు ఊరట లభిస్తుంది. రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరిగి, జీవన నాణ్యత మెరుగుపడుతుంది. ఆర్థిక వృద్ధికి ఊతమిస్తుంది. ధరలు తగ్గడం వల్ల వినియోగం పెరుగుతుంది, ఇది దేశ ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. ఎంఎస్‌ఎంఈలకు లాభం చేకూరుతుంది. సరళీకృత పన్ను నిర్మాణం, తగ్గిన రేట్లతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపార వ్యయాలు తగ్గుతాయి. దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉంటాయి. పన్ను నిర్మాణం సులభం కావడం వల్ల పన్ను వివాదాలు తగ్గి, వ్యాపార వాతావరణం మెరుగుపడుతుంది. దీంతో వ్యాపారులు మరింత సులభంగా తమ కార్యకలాపాలను నిర్వహించగలుగుతారు.

పన్ను రేట్ల తగ్గింపు వల్ల స్వల్ప కాలంలో ప్రభుత్వ ఆదాయంపై కొంత ప్రభావం ఉన్నప్పటికీ, వినియోగం పెరగడం వల్ల దీర్ఘకాలంలో ఈ లోటు భర్తీ అవుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఈ సంస్కరణలు నిజంగానే దీపావళికి సామాన్య ప్రజలకు ఒక గొప్ప బహుమతిగా మారబోతున్నాయి.

# మాజీ మంత్రి సబితకు నోటీసులు: హైకోర్టు కీలక ఆదేశం



**హైదరాబాద్  పెన్ పవర్:** తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేశారు. కర్ణాటకకు చెందిన మాజీ మంత్రి గాలి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఓబులాపురం మైనింగ్ అక్రమాల కేసులో తెలంగాణకు చెందిన మాజీ మంత్రి, ప్రస్తుత మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈమెతో పాటు.. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఐఏఎస్ కృపానందానికి కూడా నోటీసులు జారీ చేసింది. గతంలో నాంపల్లి సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

**ఏం జరిగింది?**

వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో ఓబుళాపురం మైనింగ్ గనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. దీనిపై సీబీఐ సుదీర్ఘంగా విచారణ జరిపింది. ఈ మైనింగ్ అనుమతులు ఇవ్వడంలో అప్పటి మంత్రిగా సబిత, ఐఏఎస్ అధికారులు కృపానందం, శ్రీలక్ష్మి సహా పలువురి పాత్ర ఉందని పేర్కొంది. ఈ క్రమంలో వారిపై ఛార్జిషీట్లు కూడా దాఖలయ్యాయి. అయితే.. తమకు ఈ కేసుతో సంబంధం లేదని.. విధానపరమైన నిర్ణయానికి మాత్రమే తాము కట్టుబడి ఉన్నామని వారు వాదనలు వినిపించారు.

ఈ క్రమంలోనే నాంపల్లిలోని సీబీఐ కోర్టులో పిటిషన్లు వేసి.. ఉపశమనం పొందారు. శ్రీలక్ష్మి విషయంలో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమెపై తిరిగి కేసును కొనసాగిస్తున్నారు. తాజాగా సబిత, కృపానందంలను కూడా నాంపల్లి కోర్టు నిర్దోషులుగా ప్రకటించడాన్ని సవాలు చేస్తూ.. సీబీఐ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది. సీబీఐ పిటిషన్ కు కౌంటర్ దాఖలు చేయాలని.. కృపానందం సహా.. సబితను ఆదేశించింది. అనంతరం విచారణను సెప్టెంబరు కు వాయిదా వేసింది.

## సంజు పనికి రాడు.. 14 ఏళ్ళ కుర్రాడిని ఆసియా కప్‌లో ఓపెనింగ్‌కు పంపండి: కృష్ణమాచారి శ్రీకాంత్



**హైదరాబాద్ పెన్ పవర్:** అబుదాబి, దుబాయ్ వేదికలుగా జరగనున్న ఆసియా కప్ 2025లో టీమిండియా ఫేవరేట్ గా బరిలోకి దిగుతుంది. భారత జట్టుకు పోటీనిచ్చే జట్లు కనిపించడం లేదు. సెప్టెంబర్ 9 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నీ సెప్టెంబర్ 28న జరగబోయే ఫైనల్ తో ముగుస్తుంది. ఈ కాంటినెంటల్ టోర్నీకి మంగళవారం (ఆగస్టు 18) భారత జట్టును ప్రకటించనున్నారు. ఆసియా కప్ లో ఓపెనర్లుగా అభిషేక్ శర్మతో పాటు సంజు శాంసన్ దిగడం దాదాపుగా కన్ఫర్మ్ అయింది. వీరి చోటుపై ఎవరికీ సందేహాలు లేవు.

గత ఏడాది కాలంగా టీ20 ఫార్మాట్ లో అద్భుతంగా రాణించడమే ఇందుకు కారణం. అయితే భారత మాజీ ప్లేయర్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఓపెనింగ్ లో కొత్త కాంబోని సూచించాడు. యుఎఇలో జరగనున్న ఆసియా కప్ లో టీమిండియా ఓపెనింగ్ గురించి తన అభిప్రాయాన్ని తెలిపాడు. సంజు సామ్సన్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించకూడదని శ్రీకాంత్ సూచించాడు. శాంసన్ కు బదులుగా సాయి సుదర్శన్, వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్‌లలో ఒకరిని అభిషేక్ శర్మతో ఓపెనింగ్ చేయాలని చెప్పాడు. ఇందుకు గల కారణం కూడా శ్రీకాంత్ వివరించాడు.

"ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్ లో షార్ట్ బాల్‌ను ఎదుర్కోవడానికి సంజు సామ్సన్ ఇబ్బందిపడ్డాడు. నా అభిప్రాయం ప్రకారం, శాంసన్ ఓపెనింగ్ చేయడం సందేహమే. నేను సెలెక్టర్ అయితే, అభిషేక్ శర్మ నా మొదటి ఎంపిక.

అతనితో పాటు నేను వైభవ్ సూర్యవంశీ లేదా సాయి సుదర్శన్‌ను ఎంచుకుంటాను. నా 15 మంది సభ్యుల టీ20 ప్రపంచ కప్ జట్టులో వైభవ్ సూర్యవంశీ కూడా ఉంటే బాగుండు. అతను అద్భుతంగా ఆడుతున్నాడు. సాయి సుదర్శన్ ఆరెంజ్ క్యాప్ హోల్డర్. అతను చాలా బాగా రాణిస్తున్నాడు. యశస్వి జైస్వాల్ కూడా మంచి ఎంపిక". అని శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్ 'చీకీ చీకా'లో ఝున్నారు.

ఐపీఎల్ 2025 సీజన్ లో వైభవ్ సూర్యవంశీ 14 ఏళ్ళ వయసులోనే 35 బంతుల్లోనే సెంచరీ కొట్టి ప్రపంచ క్రికెట్ ను ఆశ్చర్యపరిచాడు. ఐపీఎల్ తర్వాత ఇంగ్లాండ్ తో జరిగిన యూత్ వన్డే సిరీస్ లోనూ అదరగొట్టాడు. ఇక సాయి సుదర్శన్ ఈ సీజన్ ఐపీఎల్ లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. జైశ్వాల్ ఇప్పటికే భారత క్రికెట్ లో తనదైన ముద్ర వేశాడు. మరోవైపు 2024 టీ20 వరల్డ్ కప్ తర్వాత సంజు శాంసన్, అభిషేక్ శర్మ ఓపెనర్లుగా దుమ్ములేపారు. వీరిద్దరూ 30 ఇన్నింగ్స్‌లలో 157.09 స్ట్రైక్ రేట్‌తో 33.62 సగటుతో 908 పరుగులు చేశాడు. వీటిలో మూడు సెంచరీలు, మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి.

# సఫారీలతో కంగారులు ఢీ.. నేటి నుంచి వన్డే సిరీస్.. స్క్వాడ్, లైవ్ స్ట్రీమింగ్ పూర్తి వివరాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెలలో ఇండియా మ్యాచ్ లు లేకపోయినా క్రికెట్ ఫ్యాన్స్ ను అలరించడానికి రెండు అగ్ర జట్లు సిద్ధంగా ఉన్నాయి. ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా జట్లు వన్డే సిరీస్ తో ఫ్యాన్స్ కు వినోదాన్ని అందించనున్నాయి. ఇటీవలే టీ20 సిరీస్ ముగించుకున్న రెండు జట్లు మంగళవారం (ఆగస్టు 19) నుంచి వన్డే సిరీస్ కు సిద్ధమవుతున్నాయి. బవుమా, రబడా, హెడ్, హాజిల్‌వుడ్ లాంటి స్టార్ ఆటగాళ్లు ఈ సిరీస్ లో ప్రధాన ఆకర్షణగా మారనున్నారు. మూడు వన్డేల సిరీస్ లో భాగంగా తొలి వన్డే ఆగస్టు 19 న ప్రారంభం కానుంది. మ్యాచ్ లన్నీ ఆస్ట్రేలియాలోని డార్విన్, కైర్న్స్, మెకే వేదికలుగా జరుగుతాయి. రెగ్యులర్ కెప్టెన్ టెంబా బవుమా సౌతాఫ్రికా జట్టును నడిపించనున్నాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ తర్వాత బవుమా తొలిసారి అంతర్జాతీయ మ్యాచ్ ఆడనున్నాడు. మరోవైపు కమ్మిన్స్ దూరం కావడంతో ఆస్ట్రేలియా జట్టుకు మిచెల్ మార్ష్ కెప్టెన్సీ చేయనున్నాడు. టీ20 సిరీస్ లో అద్భుతంగా రాణించిన డెవాల్డ్ బ్రెవిస్, ర్యాన్ రికెల్టన్ పై అందరి చూపు నెలకొంది. ఆస్ట్రేలియా కెప్టెన్ కమ్మిన్స్ తో పాటు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ దూరం కానున్నాడు. హెడ్, మార్ష్, గ్రీన్, లాబుస్చాగ్నే, ఇంగ్లిస్ రూపంలో ఆస్ట్రేలియా బ్యాటింగ్ లైనప్ బలంగా కనిపిస్తుంది. స్టీవ్ స్మిత్, మ్యాక్స్ వెల్ ఈ ఏడాది వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత ఆస్ట్రేలియా ఆడుతున్న తొలి వన్డే సిరీస్ ఇదే.

**లైవ్ స్ట్రీమింగ్ ఎక్కడ చూడాలంటే..?**

ఇండియాలో స్ట్రేలియా, సౌతాఫ్రికా సిరీస్ టీవీల్లో స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారమవుతుంది. ఆన్ లైన్ లో ఈ సిరీస్ ను జియోహాట్‌స్టార్, వెబ్‌సైట్‌లో లైవ్ చూడొచ్చు.

**సౌతాఫ్రికా వన్డే జట్టు:**

టెంబా బావుమా (కెప్టెన్), కార్బిన్ బాష్, మాథ్యూ బ్రీట్జ్కే, డెవాల్డ్ బ్రీవిస్, నాంద్రే బర్గర్, టోనీ డి జోర్జి, ఐడెన్ మార్క్రామ్, సెనురన్ ముత్తుసామి, కేశవ్ మహరాజ్, వియాన్ ముల్డర్, లుంగీ ఎన్గిడి, లువాన్-డ్రే ప్రెటోరియస్, ర్యాన్-డ్రే ప్రెటోరియస్, సెయింట్ రౌస్టన్, ఆర్. ప్రేనెలన్ సుబ్రాయెన్

**ఆస్ట్రేలియా వన్డే జట్టు:**

మిచెల్ మార్ష్ (కెప్టెన్), జేవియర్ బార్ట్‌లెట్, అలెక్స్ కారీ , బెన్ డ్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, కామెరాన్ గ్రీన్, జోష్ హాజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, మార్నస్ లాబుస్చాగ్నే, లాన్స్ మోరిస్, మిచెల్ ఓవెన్, మాథ్యూ షార్ట్, ఆడమ్ జంపా

## టీమిండియాలో చోటు ఖాయం.. 92 బంతుల్లోనే సెంచరీ కొట్టిన ముంబై కుర్రాడు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యువ క్రికెటర్ సర్ఫరాజ్ ఖాన్ మరోసారి జాతీయ సెలక్టర్లకు సవాలు విసిరాడు. ఇటీవలే ఇంగ్లాండ్ తో ముగిసిన టెస్ట్ సిరీస్ లో సర్ఫరాజ్ కు చోటు దక్కని సంగతి తెలిసిందే. జట్టులో ఉండడానికి అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సెలక్టర్లు ఈ ముంబై కుర్రాడిని పట్టించుకోలేదు. ఆ తర్వాత తన ఫిట్ నెస్ పై ఫోకస్ చేసి కేవలం రెండు నెలల్లోనే 17 కిలోల శరీర బరువు తగ్గి స్లిమ్ అండ్ ట్రిమ్ లుక్ తో కనిపించి ఆశ్చర్యానికి గురి చేశాడు. ప్రస్తుతం డొమెస్టిక్ క్రికెట్ లో సెంచరీ కొట్టి సత్తా చాటి భారత టెస్ట్ జట్టులో చోటు సంపాదించే పనిలో ఉన్నాడు.

ప్రతిష్టాత్మకమైన ఆల్ ఇండియా బుచ్చి బాబు టోర్నమెంట్ సోమవారం (ఆగస్టు 18) నుంచి ప్రారంభమైన సంగతి తెలిసిందే. గోజన్ కాలేజ్ ఎ గ్రౌండ్‌లో ముంబై తరపున ఆడుతున్న సర్ఫరాజ్.. TNCAపై 92 బంతుల్లోనే సెంచరీ చేయడం విశేషం. 98 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న ముంబై జట్టును తన సెంచరీతో ఆదుకున్నాడు. వన్డే రీతిలో చెలరేగుతూ అలవోకగా బౌండరీల వర్షం కురిపించాడు. ఓవరాల్ గా 138 పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్ గా పెవిలియన్ కు చేరాడు. సర్ఫరాజ్ ఇన్నింగ్స్ లో 10 ఫోర్లతో పాటు 6 సిక్సర్లు ఉన్నాయి. సర్ఫరాజ్ సెంచరీతో ప్రస్తుతం ముంబై తొలి రోజు 5 వికెట్ల నష్టానికి 365 పరుగులు చేసి పటిష్ట స్థితిలో నిలిచింది. సర్ఫరాజ్ తన చివరి టెస్టును గత ఏడాది డిసెంబర్‌లో ఆస్ట్రేలియా ప్రైమ్ మినిస్టర్ XIతో ఆడాడు. ఆ తర్వాత ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో సర్ఫరాజ్ ఎంపికైనా ఒక్క మ్యాచ్ లో కూడా ఆడే అవకాశం రాలేదు. దీనికి తోడు గాయం కారణంగా 2024-25 రంజీ ట్రోఫీకి దూరమయ్యాడు. 2024 ఫిబ్రవరి 15 రాజ్‌కోట్‌లోని నిరంజన్ షా స్టేడియంలో ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో సర్ఫరాజ్ తన టెస్ట్ అరంగేట్రం చేశాడు. తొలి మ్యాచ్ లోనే రెండు ఇన్నింగ్స్ ల్లో హాఫ్ సెంచరీలు చేసి సత్తా చాటాడు. ఓవరాల్ గా ఆరు టెస్టుల్లో ఇండియా తరపున 371 పరుగులు చేశాడు.

# కూలీ వర్సెస్ వార్ 2- తొలి వీకెండ్ లో రజనీ కాంత్ దే పైచేయి!

సూపర్‌స్టార్ రజనీకాంత్ 'కూలీ, జూనియర్ ఎన్టీఆర్- హృతిక్ రోషన్ లీడ్ రోల్స్ లో నటించిన 'వార్ 2' ఆగస్టు 14న విడుదలై బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తున్నాయి. రెండు సినిమాలకు మిశ్రమ స్పందన లభించింది. అయినప్పటికీ.. వసూళ్లలో ఫర్వాలేదనిపిస్తున్నాయి. ఇక ఈ సినిమాలు రిలీజై, తొలి వీకెండ్ కూడా కంప్లీట్ చేసుకున్నాయి. ఈ క్రమంలో ఏ సినిమాకు ఎంతెంత వచ్చాయో చూద్దాం!ఇండిపెండెన్స్ డే, లాంగ్ వీకెండ్ ముగిసింది. దీంతో వార్ 2, కూలీ తొలి వారాంతం కలెక్షన్ల లెక్కలు బయటకు వస్తున్నాయి. అయితే ఈ లెక్కల ప్రకారం.. వార్ 2 కంటే కూలీనే ఎక్కువగా వసూల్ చేసింది. బాక్సాఫీస్ రేసులో వార్ 2 పై కూలీ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. కూలీ నాలుగు రోజుల్లో దేశీయంగా రూ.194.25 కోట్ల కలెక్షన్లు రాబట్టింది. నాలుగో రోజు ఒక్క రోజే కూలీకి రూ.35 కోట్లు వచ్చాయి. అటు వార్ 2 ఇప్పటివరకు తొలి వీకెంట్ క్లోజ్ అయ్యేసరికి రూ.173.60 కోట్లు వసూల్ చేసింది. నాలుగో రోజు ఈ సినిమాకు రూ. 31 కోట్లు వసూల్ అయ్యియి. అంటే ఫస్ట్ వీకెండ్ లో వార్ 2 కంటే కూలీ రూ.20.65 కోట్లు అత్యధికంగా వచ్చాయి.కాగా, తొలి రోజు రజనీకాంత్ కూలీ రూ.65 కోట్లు వసూల్ చేయగా, వార్ 2కు రూ.52.50 కోట్లు వచ్చాయి. అయితే రెండో రోజు కూలీకి వార్ 2 గట్టి పోటీ ఇచ్చింది. కూలీ రెండో రోజు రూ.54.75 కోట్లు కలెక్ట్ చేయగా.. వార్ 2 రూ .57.35 వసూల్ చేసింది. అంటే దాదాపు రూ.3 కోట్లు కూలీ కంటే ఎక్కువగా వార్ 2 వసూల్ సాధించింది.ఇక మూడోరోజు నుంచి కూలీ రేసులో ముందుకు వచ్చింది. మూడో రోజు కూలీ రూ. 39.5 కోట్లు వసూలు చేయగా, వార్ 2 రూ. 33.25 కోట్ల వద్దే ఆగింది. ఇక వీకెండ్ సండే రెండు చిత్రాల వసూళ్లు కాస్త నెమ్మదించాయి. అయినప్పటికీ కూలీ రూ. 35 కోట్లు చేయగా ఎన్టీఆర్ కూలీ రూ. 31 కోట్లు వసూలు చేశాడు.ఇక వరల్డ్ వైడ్ గా కూలీ తమిళ సినిమా రికార్డులను తిరిగి రాస్తూ.. రూ. 320 కోట్లు క్రాస్ చేసింది. అటు వార్ 2 ప్రపంచవ్యాప్తంగా రూ. 215 కోట్లు దాటింది. ఇక ఓవరాల్ గా రజనీ కూలీ ఈ రేసులో ముందుంది. అయితే ఇప్పుడు లాండ్ వీకెండ్ ముగిసింది. ఇక రెండో వారంలో రెండు సినిమాలకు అసలైన పరీక్ష మొదల కానుంది. చూడాలి ఈ రేసులో రజనీ ముందుంటాడా? లేదా ఎన్టీఆర్ బౌన్స్ బ్యాక్ అవుతాడా? చూడాలి



**డాంగే విడుదల కోసం నికితా కౌంట్‌డౌన్ ఆనందం!**



**ఆశు రెడ్డికి యానిమల్ ఫ్యాషన్ ఫీవర్ కలకలం రేపింది**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS, H.NO: 38-4-216, Maharani street, Marripalem, Visakhapatnam, Andhrapradesh-530018, And Published at Flat No: F5 C/o M.Ramesh kumar,1st Floor, Prasanthi Appt,Sriram Nagar, Station Road, Bhanugudi, Kakinda, East Godavari -533003, Andhra Pradesh, Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2017/73154, e-mail:penpower9@gmail.com